www.prajajwalanews.com

PJ ప్రజాజ్వాల NEWS

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

RNI No.APTEL 2010/33409
ప్రజాజ్వాల తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
చీఫ్ ఎడిటర్ మాదగారి సుగ్రీవుడు, 9441284503

గురువారం | 18-9-2025 | సంపుటి: 15 | సంచిక: 93 | పేజీలు : 8 | వెల : 4/- | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# రాష్ట్రంలోని అన్నివర్గాలను ప్రభుత్వం వేధిస్తోంది

**సీఎం వేధింపుల వల్లే మెట్రో నుంచి ఎల్అండ్‌టీ నిష్కమణ**

**త్వరలో ఎమ్మార్ ఆస్తులను అమ్మే ప్రయత్నాల్లో సీఎం**

**జైపాల్ రెడ్డి కుటుంబ భూముల కోసమే ఫోర్త్ సిటీకి రోడ్డు**

**రేవంత్ ముమ్మాటికీ బీజేపీ మనిషి, ఎంపీలను అమ్మేశారు**



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలపై నిరంకుశత్వాన్ని చూపుతోందని మండిపడ్డారు. గ్రూప్ 1 అభ్యర్థులు, విద్యార్థులు కనీసం రౌండ్ టేబుల్‌సమావేశం నిర్వహించుకునే పరిస్థితి కూడా లేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 'సీఎం రేవంత్ బెదిరింపులు, ముడుపుల కోసం వేదింపులు తట్టుకోలేక హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ సంస్థ వైదొలుగుతోంది. గతంలో ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌ను జైల్లో పెడతానని బెదిరించారు. గతంలో వివాదాస్పదమైన ఎమ్మార్ సంస్థ ఆస్తులను కూడా కమీషన్ల కోసం రేవంత్‌రెడ్డి త్వరలో అమ్మబోతున్నారు. పలు కంపెనీలపై గతంలో

- మిగతా 2వ పేజీలో



## సరికొత్త విద్యా విధానాన్ని తీసుకొద్దాం

### ఈ విధానం వచ్చే 25 ఏళ్ల వరకు దిశా నిర్దేశం చేసేలా ఉండాలి

**తెలంగాణ విద్యా విధానం ఖరారు కమిటీ సమావేశంలో సీఎం రేవంత్**

**భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో బోధన సాగాలి**

**ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాలి**

**నిరుపేదలకు మేలు జరగాలి.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి**

**మేధావులు, విద్యావేత్తలు ఈ మేరకు సలహాలివ్వాలన్న ముఖ్యమంత్రి**

**మౌలిక వసతులపై ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడి**

హైదరాబాద్: రాష్ట్ర విద్యా విధానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సరికొత్త తెలంగాణ విద్యా విధానం తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన అని వెల్లడించారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారిలో జ్ఞానం కొరవడిందని, జ్ఞానం ఉన్న వారికి భాషలో పట్టు లేదని అన్నారు. ఈ రెండూ ఉన్న వారిలో నైపుణ్యం ఉండటం లేదని చెప్పారు. దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, ఆ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగవ్వడం లేదని చెప్పారు. ఈ కారణంగా ఉద్యోగాలను సొంతం చేసుకోవడంలో యువత వెనుకబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భాష, జ్ఞానం, నైపుణ్యాలు,

- మిగతా 2వ పేజీలో




## గ్రూప్-1 తీర్పుపై డివిజన్ బెంచ్‌కు టిజిపిఎస్‌సి అప్పీల్

## ప్రపంచాన్ని శాసిస్తున్నాం: రాజ్‌నాథ్

**మన కళ్లలో కళ్లు పెట్టి చూసే సాహసం శత్రువులు సైతం చేయలేరు**

**ఆపరేషన్ సిందూర్ ఆగలేదు..కొనసాగుతూనే ఉంది.. భారత్ ఏ శక్తి ముందూ తలవంచదు**


**విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

**పటేల్ ఉక్కుపాదం మోపడంతోనే నిజాం దిగివచ్చాడు: కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షేకావత్**

**మజ్లిస్ నేతలకు కాంగ్రెస్ వంగివంగి దండాలు: కిషన్‌రెడ్డి.. మజ్లిస్‌కు భయపడి విమోచనంపై సర్కార్ వెనుకడుగు: బండి**

హైదరాబాద్ : 'భారత్ ఏ శక్తి ముందు తలవంచదు.. భవిష్యత్తులోనూ దించదు ఆపరేషన్ సిందూర్ అరంభం మాత్రమే అంతం కాదు..' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ఆపరేషన్ సిందూర్ ముగియలేదన్నారు. పహల్గాంలో తీవ్రవాదులు

- మిగతా 2వ పేజీలో





## ఇజ్రాయెల్ అధీనంలోకి గాజా

- ఆ నగరంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం
- ఇప్పటికే 75% భూభాగం స్వాధీనం
- వైమానిక దాడుల్లో పలు భవనాలు నేలమట్టం
- ఉధృతంగా కొనసాగుతున్న భూతల దాడులు
- తీరప్రాంతాలకు వెళ్లిపోతున్న గాజా వాసులు
- రెండేళ్ల యుద్ధంలో 65 వేలకు చేరిన మృతులు



## హైదరాబాద్ కకావికలం

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సర్కార్ సంకల్పం: పిసిసి చీఫ్



## చొరబాటుదారుల కోసం కాంగ్రెస్ యాత్రలా?

వారి ఓట్లతో ఎన్నికల్లో నెగ్గడానికి కుట్రలు

కేంద్రమంత్రి అమిత్ షా ఆగ్రహం



# ఇజ్రాయెల్ అధీనంలోకి గాజా

### ఆ నగరంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

### ఇప్పటికే 75% భూభాగం స్వాధీనం

### వైమానిక దాడుల్లో పలు భవనాలు నేలమట్టం

### ఉధృతంగా కొనసాగుతున్న భూతల దాడులు

### తీరప్రాంతాలకు వెళ్లిపోతున్న గాజా వాసులు

### రెండేళ్ల యుద్ధంలో 65 వేలకు చేరిన మృతులు

గాజా/టెల్అవీవ్, సెప్టెంబరు 17: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో పాటు భూతల దాడులు కూడా తోడవడంతో గాజా ధ్వంసమైపోతోంది. బహుళ అంతస్థుల భవనాలు క్షణాల్లో నేలమట్టమవుతున్నాయి. గాజాపై ఇప్పటికే 75 శాతం నియంత్రణ తెచ్చుకున్న ఇజ్రాయెల్ పూర్తి పట్టుకోసం భూతల దాడులు ముమ్మరం చేసింది. దీనికి తోడు గాజా సిటీలో ఇప్పటికీ 3 వేల మంది హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని వారిని అంతమొందిస్తేనే తమ లక్ష్యం నెరవేరుతుందంటూ దాడులు కొనసాగిస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తోందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెలువడినా ఐడీఎఫ్ ఉధృతంగా దాడులు చేస్తోంది. దాడులు విధ్వంసకరంగా మారడంతో గాజా సిటీ నుంచి వేలాది మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తీరప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. తీర ప్రాంత రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. సిటీని వీడాలన్న ఐడీఎఫ్ హెచ్చరికలతో ముందుగానే మూడున్నర లక్షల మంది తీరప్రాంతాలకు వెళ్లిపోగా భూతల దాడుల తర్వాత మరో 3 లక్షల మంది గాజా నగరాన్ని విడిచిపెట్టారని సమాచారం. ఇజ్రాయెల్ దాడుల్లో గత రెండేళ్లలో 65,062 మంది పాలస్తీనియన్లు మృతిచెందగా 1,65,697 మంది గాయపడ్డారు. యెమెన్‌లోని హొడైడాలో ఉన్న హౌతీల ఆయుధ స్థావరాలపై ఇజ్రాయెల్ భారీగా వైమానిక దాడులు జరిపింది. దీంతో హౌతీలు తమ గగనతల రక్షణ వ్యవస్థను క్రియాశీలం చేశారు. ఈ కారణంగా ఇజ్రాయెల్ విమానాలు తికమకపడి వెనుతిరిగాయని హౌతీల అధికార ప్రతినిధి ప్రకటించారు. ఆ తర్వాత హౌతీలు ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగించడంతో జెరుసలెంతో పాటు టెల్ అవీవ్‌లో సైరన్లు మోగాయి. హౌతీల రాకెట్లను కూల్చేశామని ఐడీఎఫ్ ప్రకటించింది. గాజాపై భారీ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించాలని యూరోపియన్ యూనియన్ యోచిస్తోంది. అయితే ఏకాభిప్రాయం కుదరడం లేదు. జర్మనీ, హంగేరీ, చెక్ రిపబ్లిక్ వంటి దేశాలు వ్యతిరేకిస్తుండగా స్పెయిన్, ఐర్లాండ్ దేశాలు ఆంక్షలను సమర్థిస్తున్నాయి. మరోవైపు తమపై ఆంక్షలు విధించాలన్న ఈయూ యోచనను ఇజ్రాయెల్ తప్పుబట్టింది.

## చొరబాటుదారుల కోసం కాంగ్రెస్ యాత్రలా?

న్యూఢిల్లీ: విపక్ష కాంగ్రెస్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా ఆ పార్టీ యాత్రలు చేస్తోందని మండిపడ్డారు. చొరబాటుదారుల ఓట్లతో ఎన్నికల్లో నెగ్గాలని కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 ప్రజా సంక్షేమ పథకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ తీరును తప్పుపట్టారు. దేశ పౌరులపై కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఏమాత్రం విశ్వాసం లేదని విమర్శించారు. అందుకే చొరబాటుదారులకు అండగా నిలుస్తున్నారని, వారిని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాల్లో చొరబాటుదారులు ఎప్పటికీ ఉండాలన్నదే కాంగ్రెస్ విధానమని ఆక్షేపించారు. మనదేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారికి ఓట్లు హక్కు ఇవ్వాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో నెగ్గడానికి అక్రమ వలసదారులకు అండగా నిలుస్తారా? ఇదెక్కడి చోద్యం అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు అమిత్ షా స్పష్టంచేశారు. బిహార్‌లో కాంగ్రెస్ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రపై విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారుల పేర్లను తొలగిస్తే తప్పేమిటని అన్నారు. దేశ సరిహద్దులను మోదీ ప్రభుత్వం కాపాడుతోందని చెప్పారు. మన సరిహద్దులను అతిక్రమించాలని చూసిన శత్రువులపై సర్జికల్, వైమానిక దాడులు చేసినట్లు గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం నేర్పామని వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలో 2027 నాటికి మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. ఇకపై స్వదేశీ ఉత్పత్తులు ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఇప్పటిదాకా ఎన్నో విజయాలు సాధించిందని, దేశ ప్రజలు వాటిని ఎప్పటికీ మర్చిపోలేరని వెల్లడించారు. మోదీ పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి లభించిందని గుర్తుచేశారు.

## గ్రూప్-1 తీర్పుపై డివిజన్ బెంచ్‌కు టిజిపిఎస్‌సి అప్పీల్

హైదరాబాద్: గ్రూప్ 1 తీర్పుపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు సింగిల్ బెంచ్ వెల్లడించిన తీర్పుపై టిజిపిఎస్‌సి డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. గ్రూప్ 1 ఫలితాలపై నమోదైన పిటిషన్లను విచారించిన ధర్మాసనం జనరల్ ర్యాంకింగ్ జాబితా రద్దు చేయాలని, పేపర్లు తిరిగి మూల్యాకనం చేయాలని, కుదరకపోతే తిరిగి పరీక్ష నిర్వహించాలని తీర్పు చెప్పిన విషయం విధితమే. ఈ తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించిన టిజిపిఎస్‌సి బుధవారం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కాగా, డివిజన్ బెంచ్‌లో అనుకూలంగా లేని పక్షంలో సుప్రీం కోర్టుకు సైతం వేళ్లేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రూప్ 1 తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో టిజిపిఎస్‌సి అప్పీల్‌కు వెళ్లడం గ్రూప్ 1 పరీక్షల అంశం ఉత్కంఠంగా మారింది.

# సరికొత్త విద్యా విధానాన్ని తీసుకొద్దాం

క్రీడల మేళవింపుతో విద్యా బోధన సాగాలని, వచ్చే 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరించనున్న 'తెలంగాణ రైజింగ్%-%2047'లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో రాష్ట్ర విద్యా విధానం ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీతో బుధవారం సీఎం భేటీ అయ్యారు. విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించారు. 'విద్యా రంగం అభివృద్ధికి ఇప్పటివరకు జరిగిన కృషిపై ఏమాత్రం సంతృప్తి లేదు. ఈ రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ప్రభుత్వ స్కూళ్ళల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయి. నర్సరీకి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడటం లేదు. విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఉంటుందని, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ ప్రక్షాళన అవసరం. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు. 'ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకోవాలి. విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలి. రాష్ట్రంలోని నిరుపేదలకు మేలు జరిగేలా కొత్త విద్యా విధానం ఉండేందుకు మేధావులు సలహాలివ్వాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల పేరిట విద్యార్థులను చిన్నతనం నుంచే వేరు చేస్తున్నాం. దానిని రూపుమాపి అంతా ఒకటే అనే భావన కలిగించాలి. విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలి. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలి..' అని సీఎం చెప్పారు. 'ప్రభుత్వం కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు ఉండాలన్న లక్ష్యంతోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం. బదిలీలు, పదోన్నతులు కల్పించాం. యూనివర్సిటీలకు వీసీలను నియమించాం. దేశంలో ఐటీఐలు ప్రారంభించినప్పుడు ఉన్న డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మేము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను తెచ్చాం. సరికొత్త విద్యా విధానం ఏర్పాటుకు ఎంత నిధులైనా వెనుకాడబోం. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించాం. విద్యపై చేసే వ్యయాన్ని ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నాం. విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం..' అని రేవంత్ అన్నారు. 'విద్యా విధానం కమిటీ చైర్మన్ కె.కేశవరావు మాట్లాడుతూ..విద్యాలయాల్లో విద్యార్థి కేంద్రంగా, నాణ్యతకు పెద్ద పీట వేసేలా బోధన ఉండాలన్నారు. ఏకీకృత బోధన విధానం వల్లే తెలంగాణ విద్యారంగంలో మార్పు సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ధనిక, పేద తారతమ్యం లేని, కులమతాల ప్రస్తావన లేని విద్యాలయాల ఏర్పాటు అవసరమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రతి తరగతికీ గది, ఉపాధ్యాయుడు ఉండాలని మరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సూచించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతాసిన్హా, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, సీఐఐ శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, అక్షర వనం మాధవరెడ్డి, ప్రొపెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిన్నీ మాథ్యూ, రంజీవ్ ఆచార్య, తదితరులు నూతన విద్యా విధానంపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, దేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికొలస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని శాసిస్తున్నాం: రాజ్‌నాథ్



మన భారతీయులను మతం అడుగుతూ చంపారని ఆయన తెలిపారు. దానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో మన సైనికులు తీవ్రవాది మసూద్ అజర్‌ను మట్టుబెట్టారని, స్థావరాలను ధ్వంసం చేశారని ఆయన చెప్పారు. మన సైనికులు చాటిన సత్తాను ప్రపంచం అంతా ఆసక్తిగా గమనించిందని ఆయన తెలిపారు. దేశంలో ఎన్ని విభేదాలు ఉన్నా దేశం విషయంలో అందరూ కలిసి ఒకే మాటపై ఉంటామని, దేశ రక్షణ, భద్రత విషయంలో ఏకతాటిపై ఉంటామన్నారు. మన దేశం ఇప్పుడు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిందని ఆయన తెలిపారు. నాడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే నిజాం తన ఓటమిని అంగీకరించి లొంగి పోయాడని ఆయన చెప్పారు. దీంతో భారత్‌లో హైదరాబాద్ రాజ్యం విలీనమైందన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలో నడుస్తామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జాతీయ సమర్థతను దెబ్బ తీసే కుట్రలను తిప్పికొడతామన్నారు. పటేల్ కన్న కలలకు అనుగుణంగానే ప్రధాని నరేంద్ర మోడి పాలన సాగుతున్నదని ఆయన చెప్పారు. భారత్‌ను ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని కళ్ళలో కళ్ళు పెట్టి చూసే సాహసాన్ని శతృవులు చేయలేరని అన్నారు.

**తెలుగులో నమస్కారం..**

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలుత తెలుగులో 'అందరికీ నమస్కారం, జోహార్ తెలంగాణ' అని చెప్పి ఆ తర్వాత హిందీలో ప్రసంగాన్ని ప్రారంభించారు.

**త్యాగధనుల ఫలితమే: కేంద్ర మంత్రి షెకావత్**

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రసంగిస్తూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ ఉక్కు పాదం మోపడంతో నియంత నిజాం దిగి వచ్చాడని అన్నారు. తన కుటుంబ సభ్యులు కూడా నాడు నిజాంకు వ్యతిరేకంగా పోరాడారని ఆయన చెప్పారు.

**మజ్లీస్ నేతలకు వంగి, వంగి దండాలా?: కిషన్ రెడ్డి గరం**

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ మజ్లీస్ నేతలకు భయపడి చరిత్రను వక్రీకరిస్తున్నారని, విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరిపేందుకు జంకుతున్నారని విమర్శించారు. మజ్లీస్ నేతలకు వంగి, వంగి దండాలు పెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. మూడేళ్ళ తర్వాత అధికారంలోకి రాగానే అధికారికంగా జరుపుకుందామని ఆయన తెలిపారు. ఖాసీం రజ్వీ నేతృత్వంలో మజ్లీస్ వారి ఆగడాలు జరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం గురించి పాఠ్యాంశాల్లో చేర్చలేదని ఆయన విమర్శించారు. కర్నాటకలో అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించినప్పుడు మన వాళ్ళకు ఏమి రోగం వచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

**కేంద్ర మంత్రి బండి ధ్వజం**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రసంగిస్తూ ఒక పార్టీ మెప్పు కోసం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని పరోక్షంగా మజ్లీస్ పార్టీని దుయ్యబట్టారు. ఓటు బ్యాంకు రాజకీయాలు జరుగుతున్నాయని విమర్శించారు. బిజెపి అధికారంలోకి రాగానే బ్రహ్మాండంగా జరుపుకుందామని ఆయన తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో మహిళలపై అత్యాచారాలు జరిగాయని, అర్ధనగ్నంగా ఊరేగించారని, ఉర్దూ బలవంతంగా నేర్చుకోవాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. పరకాలలో జాతీయ జెండా ఎగుర వేసిన వారిని చంపారని ఆయన తెలిపారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం రోజే ప్రధాని నరేంద్ర మోడి జన్మదినం కావడం, విశ్వకర్మ జయంతి కూడా ఉండడం సంతోషకరమని అన్నారు. బిజెపి సహకారం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడి 12 లక్షల కోట్ల రూపాయలు విడుదల చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ వివరించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉదయం 9 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుని సర్దార్ పటేల్ విగ్రహానికి, హైదరాబాద్ విమోచన అమర వీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఆర్మీ వాహనం (ఓపెన్ టాప్ జీప్)పై నిలుచొని సైనిక బలగాల పరేడ్‌లో పాల్గొన్నారు. అనంతరం వివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ కళారూపాలను తెలియజేసే మంగళవాయిద్యాలు, నాద స్వరం, కోలాం, బాంద్రీ, లంబాడి, బోనాలు, మద్వ, కొమ్మ కోయ, గుస్సాడి కళాకారుల ప్రదర్శనను కేంద్ర మంత్రులు వీక్షించారు.

# రాష్ట్రంలోని అన్నివర్గాలను ప్రభుత్వం వేధిస్తోంది

ఉన్న కేసులను అడ్డుపెట్టుకుని రేవంత్‌రెడ్డి సెటిల్‌మెంట్లు చేసుకోవడంతోపాటు కంపెనీల నుంచి ముడుపులు తీసుకుంటున్నారు'అని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన మార్చుతుండటంతో వేలాది మంది రైతులు భూములు కోల్పోతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఫోర్త్ సిటీ దగ్గర ఉన్న తమ భూముల కోసం అలైన్‌మెంట్, ట్రిపుల్ ఆర్ స్వరూపాన్ని మార్చేశారని ఆరోపించారు. 'ట్రిపుల్ ఆర్‌కు, ఫోర్త్ సిటీకి మధ్యలో వేస్తున్న రోడ్డు కేవలం రేవంత్ రెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యుల భూముల కోసమే. ఈ రోడ్డు వెంబడి అనేక మంది నుంచి భూములు కొనుగోలు చేసి ఇప్పటికే రేవంత్ కుటుంబం ఒప్పందాలు చేసుకుంది. ఆయన హైదరాబాద్‌లోని భూములన్నింటినీ అమ్ముతున్నారు. రాష్ట్రంలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరికినా సీఎం, ఈగల్ టీమ్‌కు సమాచారం లేదు. హైడ్రా మంచి ఫలితాలు ఇస్తే వర్షం వచ్చినప్పుడు హైదరాబాద్ నగరం ఎందుకు మునిగిపోతోంది'అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎంపీలను అమ్మేసిన రేవంత్..: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎంపీలను రేవంత్‌రెడ్డి గొర్రెల్లా అమ్మేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ముమ్మాటికీ బీజేపీ మనిషే అని అన్నారు. 'రాష్ట్రంలో అద్భుత పాలన ఉంటే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి వెంటనే ఉప ఎన్నికలు పెట్టాలి. కనీసం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేనంత బలహీనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్ మాట మార్చి రాహుల్ గాంధీకి ప్రధాన మంత్రి పదవితో ముడిపెడుతున్నాడు. తీన్మార్ మల్లన్నతో సహా ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంది. గ్రూప్ 1 ఉద్యోగాలు రూ.3 కోట్ల చొప్పున అమ్ముకున్నారని అభ్యర్థులే చెప్తున్నారు. గ్రూప్ 1 పరీక్షలో అవినీతిపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది? యువతతో పెట్టుకుంటున్న రేవంత్ రెడ్డికి పతనం తప్పదు'అని కేటీఆర్ హెచ్చరించారు.

**కాళేశ్వరంపై బీజేపీ, కాంగ్రెస్ రాజకీయం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ కలిసికట్టుగా చిల్లర రాజకీయం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత ఏనుగు రాకేశ్‌రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతే హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ఎలా సాధ్యమని అసెంబ్లీలో ప్రశ్నిస్తే సర్కారు వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న వికారాబాద్ జిల్లా రైతులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సర్కార్ సంకల్పం: పిసిసి చీఫ్

హైదరాబాద్ : కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ప్రకాశం హాలులో జరిగిన మహిళా సాధికారత సమావేశానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ పరంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పోరేషన్ల నుంచి కుట్టు మిషన్ల ఇప్పించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించేందుకు మదర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఇలాంటి సంస్థలను నడిపించడం అంత తేలికైన విషయమేమీ కాదని ఆయన తెలిపారు. హైదరాబాద్ విలీనం రోజున ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టినందుకు అభినందిస్తున్నానని అన్నారు. జనహిత పాదయాత్రలో ఇండిరమ్మ ఇండ్ల లబ్దిదారుల, మహిళల కళ్ళలో చూసిన ఆనందం గురించి తాను మాటల్లో చెప్పలేనని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని ఆయన చెప్పారు. చదువుకున్న వారి జీవితం కలర్ టీవీ వంటిదని, నిరక్షరాస్యుల జీవితం బ్లాక్ అండ్ వైట్ వంటిదని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.



## హైదరాబాద్ కకావికలం

నగరం మరోసారి తడిసిముద్దయింది. బుధవారం రాత్రి కుంభవృష్టి బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి వరకు ఏకధాటిగా ఐదు గంటలపాటు కురిసిన భారీ వర్షంతో నగర జనజీవనం అతలాకుతలమైంది. ఆకాశానికి చిల్లుపడిందా? అన్నట్లుగా కురిసిన వర్ష ఉద్ధృతితో నగర వాసులు బెం బేలెత్తిపోయారు. వర్షం దాటికి నిమిషాల వ్యవధిలోనే రోడన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు అపార్ట్‌మెంట్లతోపాటు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు వచ్చి చేరగా, డైనేజీ, ఓపెన్ నాలాలు పొంగిపొర్లాయి. మెట్రో స్టేషన్లు, బ్రిడ్జిల కింద భారీగా నీరు చేరింది. పలు ప్రాంతాల్లో వరద నీటి ధాటికి వాహనాలు కొట్టుకుపోయాయి.

# సంపాదకీయం

## బిహార్‌ను మోదీ మ్యాజిక్ ఆకట్టుకునేనా

'బిహార్‌లో చొరబడిన ప్రతి ఒక్కరూ వెళ్లిపోవాల్సిందే..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం బిహార్‌లో పూర్ణియా జిల్లాలో మాట్లాడుతూ అన్నారు. బిహార్‌లో గత జనవరి నుంచి మోదీ ఏడవ పర్యటన ఇది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా మోదీ అక్కడి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తన ఎన్నికల ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటారు. బిహార్‌లో తన ప్రచారాన్ని ఏ దిశన మళ్లించబోతున్నారో ఇప్పటికే స్పష్టమైంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరిట అనేక మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ఉధృతంగా చేపట్టిన ప్రక్రియను ప్రతిపక్షాలు మాత్రమే కాదు, సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది. మొత్తం ఎస్ఐఆర్‌నే నిలిపివేస్తాం జాగ్రత్త అని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది. ఎస్ఐఆర్‌ను వివాదరహితంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైంది. ఓట్ల చోరీ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కమిషన్ వద్ద స్పష్టమైన సమాధానాలు లేవు. నిజానికి ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువ చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితి నుంచి బీజేపీని కాపాడాల్సిన బాధ్యతను మోదీయే పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. అక్రమ వలసదారుల వల్ల బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు తమ కూతుళ్లు, చెల్లెళ్ల భద్రత పట్ల ఆందోళనతో ఉన్నారని మోదీ ప్రకటించారు. అంటే అక్రమంగా వలసవచ్చిన వారు ఈ రాష్ట్రాల్లో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన సారాంశం. పైగా ఇలాంటి వారిని కాపాడేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, యాత్రలు కూడా చేస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రను ఉద్దేశంలో ఉంచుకునే ఆయన ఈ విమర్శలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

ఉత్తరాదిన అత్యంత కీలక ప్రభావం చూపే బిహార్‌లో మాత్రం బీజేపీ గత కొన్ని దశాబ్దాలుగా విశ్వయత్నాలు చేస్తున్నప్పటికీ స్వంతంగా అధికారంలోకి రాలేని స్థితి ఉన్నది. మండల్ రాజకీయాలు ప్రవేశించిన తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్ ఆవిర్భావంతో ఓబీసీలు, మైనారిటీలు సంఘటితమయ్యారు. 1995లో జార్జి ఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్‌తో కలిసి లాలూతో వేరుపడ్డ తర్వాత కూడా 2005 వరకు లాలూ ఆధిపత్యాన్ని తగ్గించలేకపోయారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో, 2000లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫెర్నాండెజ్, నితీశ్‌కుమార్‌లు ఇద్దరూ బీజేపీతో చేతులు కలిపారు. అప్పటికి లాలూ పశుగ్రాసం కుంభకోణంలో చిక్కుకుని తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేయాల్సి వచ్చింది. 2000లో నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి అయినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవడంతో మళ్లీ రబ్రీదేవి ముఖ్యమంత్రి అయి 2005 వరకు అధికారంలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్డీఏలో నితీశ్‌కుమార్ తిరుగులేని నాయకుడయ్యారు. 2010లో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జేడీ(యు) 115 సీట్లు సాధించగా, బీజేపీ 91 సీట్లు సాధించింది. కానీ బీజేపీలో క్రమక్రమంగా ఒక ప్రత్యామ్నాయ నాయకుడుగా నరేంద్రమోదీ అవతరిస్తున్న క్రమంలో నితీశ్‌కుమార్ మొదట్లో ఆయనను సరిగా అంచనా వేయలేకపోయారు. 2005, 2010లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూనే బీజేపీకి దేశమంతా స్టార్ క్యాంపెనియర్‌గా అవతరిస్తున్నప్పుడు నితీశ్ ఆయనను విస్మరించారు. 2010లో ఘన విజయం తర్వాత ఆయనలో జాతీయ స్థాయిలో ఆకాంక్షను రేకెత్తించింది. మోదీని వ్యతిరేకిస్తే లాలూ ముస్లిం ఓట్ బ్యాంకును కూడా ఆకట్టుకోగలననుకున్నాడు. తొలుత బిహార్‌లో మోదీని ప్రచారానికి పంపవద్దని బీజేపీ నాయకత్వాన్ని అడ్డుకున్న నితీశ్‌కుమార్... మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్డీఏ నుంచి తప్పుకున్నాడు. కానీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభంజనంలో బిహార్‌లో బీజేపీకి 22 సీట్లు రాగా 40 సీట్లకు పోటీ చేసిన జేడీ(యు) 2 సీట్లకు పరిమితమైంది. దీనితో 2015లో అతడు మళ్లీ లాలూతో చేతులు కలిపి ముఖ్యమంత్రి పదవికోసం రాజీపడాల్సి వచ్చింది.

ఒకప్పుడు నితీశ్‌కుమార్ తనను తీవ్రంగా వ్యతిరేకించి, తనను రాష్ట్రంలో అడుగుపెట్టనీయకుండా చేసినప్పటికీ అతడినే చేరదీసి బిహార్‌లో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయగలగడం మోదీ ప్రత్యేకత. నిజానికి జేడీ(యు)%-%ఆర్‌జేడీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మోదీ ఢిల్లీ నుంచి కొన్ని వ్యూహాత్మక చర్యలు తీసుకున్నారు. మాఫియా డాన్, ఆర్‌జేడీ ఎంపీ షాహబుద్దీన్ 2016 సెప్టెంబర్‌లో వ్యూహాత్మకంగా విడుదల కావడం అందులో భాగం. పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించి నితీశ్‌కుమార్‌ను అసమర్థ ముఖ్యమంత్రిగా దూషించడం మొదలుపెట్టాడు.

-ఎడిటర్



## ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబం ముక్కచెక్కలు.. వెల్లడించిన జైషే కమాండర్

బహవలాపూర్‌లోని భారీ కాంప్లెక్స్‌పై భారత వాయుసేన జరిపిన దాడుల్లో తన కుటుంబానికి చెందిన 10 మంది సభ్యులు, నలుగురు సన్నిహితులు ప్రాణాలు కోల్పోయినట్టు మసూద్ అజార్ గత మేలో వెల్లడించారు. ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాక్‌లోని ఉగ్రవాదుల వెన్నులో చలిపుట్టించింది. ఉగ్రవాదుల రహస్య స్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయారు. జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ తాజాగా ఈ విషయాన్ని అంగీకరించారు. మే 7న భారత దళాలు బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కార్యాలయంపై జరిపిన దాడుల్లో అజార్ కుటుంబం ముక్కలైందని కశ్మీరీ తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. 'ఉగ్రవాదాన్ని స్వీకరించి దేశ సరిహద్దులను కాపాడేందుకు ఢిల్లీ, కాబూల్, కాందహార్‌లతో పోరాడాం. ఇందుకోసం మేము అన్నీ త్యాగం చేశాం. మే 7న భారత దళాలు బహవలాపూర్‌లో జరిపిన దాడుల్లో మౌలానా మసూద్ అజార్ కుటుంబ ముక్కలైంది' అని కశ్మీరీ ఆ వీడియోలో పేర్కొన్నారు. పంజాబ్‌లోని బహవలాపూర్‌లోని భారీ కాంప్లెక్స్‌పై భారత వాయుసేన జరిపిన దాడుల్లో తన కుటుంబానికి చెందిన 10 మంది సభ్యులు, నలుగురు సన్నిహితులు ప్రాణాలు కోల్పోయినట్టు మసూద్ అజార్ గత మేలో వెల్లడించారు.

## పాపన్నపేటలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**పాపన్నపేట్, ప్రజాజ్వాల:**
పాపన్నపేట్ మండలం కొడపాక కాంప్లెక్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొండవీటీ ఆరోగ్యం జి హెచ్ ఎం కార్యక్రమంలో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవము జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు మరియు స్వాతంత్ర్య సమరయోధులు అందరికీ నా జోహార్లు ... అర్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజున తెలంగాణ ప్రాంతం భారతీ యూనియన్ చేరి ప్రజా పాలన మొదలై నేటికి 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని 78వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు విద్యార్థినీ, విద్యార్థులకు, ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఈ స్వేచ్ఛ, స్వాతంత్యం, ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి ఎంతో మంది ఈ గడ్డ మీద అసమాన త్యాగాలు చేశారు. ఆనాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణా అభివృద్ధికి నాంది పలికింది. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారన్నారు. నాటి హైదరాబాదు సంస్థానం 16 జిల్లాలతో తెలుగు, మరాఠీ, కన్నడ భాషల మిశ్రమ సంస్కృతులతో కూడిన సంస్థానంగా ఉండేది. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుంది అని నైజాం రాజు ప్రకటించి రాచరిక పాలనను కొనసాగించారని వెల్లడించారు . రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మొదటిసారి అసువులు బాసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైనది. ఆనాటి పోరాటంలో తెలంగాణ మహిళలైన చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం , ఆరుట్ల కమలా దేవి కీలక పాత్ర పోషించారు. నల్లగొండ జిల్లా నుంచి బండి యాదగిరి రాసిన "బండెనకబండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లో పోతావు కొడుకో.. నైజాం సర్కారోడో..." పాట సాయుధ పోరాటాన్ని ఉధృతం చేసి రాచరిక ప్రభుత్వం పై తిరుగుబాటు చేయడానికి ప్రజల్లో చైతన్యం రగిలించింది. ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్ల 17 సెప్టెంబర్ 1948 నాడు హైదరాబాద్ సంస్తనం భారతదేశంలో విలీనం అయిందని జి హెచ్ ఎం కొండవీటీ ఆరోగ్యం విద్యార్థులను ఉదేశించి ప్రసంగించారు.



## పాలకుర్తిలో ఘనంగా ప్రధాని మోడీ జన్మదినం వేడుకలు

### బిజెపి నాయకుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**జనగామ జిల్లా, ప్రజాజ్వాల:**
ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా,భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు స్థానిక బిజెపి శ్రేణులు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని,నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ పురోగతి సాధిస్తోందని,నరేంద్ర మోడీ నాయకత్వమే ఈ దేశానికి శ్రీరామరక్ష అని,కరోనా విపత్తు వేళ ప్రపంచం మొత్తం అతలాకుతలం అయితే ప్రపంచం మొత్తం కరోనా నివారణ మందులు అందించి భారత్ ను విశ్వ గురువు స్థానం లో నిలిపారని,మోడీ జన్మదినం సెప్టెంబర్ 17నుండి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి పాలకుర్తి మండల అధ్యక్షుడు మారం రవికుమార్,రాష్ట్ర నాయకులు దొంగరి మహేందర్,కన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చింత సృజన్, కార్యదర్శి దుంపల సంపత్,కమ్మగాని శ్రీకాంత్ , మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్ ,సొసైటి డైరెక్టర్ ఈర్ల రాజు,పట్టణ అధ్యక్షుడు పబ్బా సంతోష్,మచ్చ సునీల్,బోనగిరి శ్రీనివాస్,గుడికందుల సోమేశ్వర్, శ్రీను నాయక్,గణ గణ రాజు,నర్సింహా చారీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న జెకే శేఖర్ యాదవ్

**జగద్గిరిగుట్ట, ప్రజాజ్వాల:**
విశ్వ కర్మ భగవంతుడి ఆశీస్సులతో విశ్వకర్మలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ జెకే శేఖర్ యాదవ్ ఆకాంక్షించారు. బుధవారం జగద్గిరిగుట్ట రింగ్ బస్తీలో రభి నాయక్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి పూజలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ జెకే శేఖర్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకల్లో పాల్గొని తీపి పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ స్పోక్స్ పర్సన్ మేకల సురేష్ రెడ్డి, గండి రాజు యాదవ్, ప్రమోద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## టిపీసీసీ అధ్యక్షులుగా ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ బలోపేతం

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిల సత్కారం

**హైదరాబాద్, ప్రజాజ్వాల:**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డిలు వారిని స్వగృహానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలంలో పార్టీని బలోపేతం చేయడానికి చేసిన కృషి అభినందనీయమైంది. అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేస్తూ పార్టీని గెలుపు దిశగా నడిపిస్తున్న తీరు ప్రతి కార్యకర్తకు నమ్మకం కలిగిస్తోంది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించడంలో ఆయన నాయకత్వం కీలకమవుతుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మహేష్ గౌడ్ తపన అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత పార్టీకి కొత్త జోష్ వచ్చింది. కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు ఆయన అందరినీ సమానంగా చూసుకుంటూ ముందుకు నడిపిస్తున్న తీరు ప్రశంసనీయం. ముఖ్యంగా కింది స్థాయి కార్యకర్తలకు తగిన గౌరవం ఇస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడం విశేషం. ఆయన నాయకత్వం వల్ల తెలంగాణ కాంగ్రెస్ మరింత బలపడుతుందని నమ్మకం ఉంది అని అన్నారు..






వలసలకు వ్యతిరేకంగా యునైట్ ది కింగ్‌డమ్ పేరిట లండన్‌లో తాజాగా భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో వర్చువల్‌గా ఎలాన్ మస్క్ ప్రసంగించారు. నిరసనకారులు తిరగబడి పోరాడకపోతే మరణం తప్పదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వలసలకు వ్యతిరేకంగా లండన్‌లో తాజాగా జరిగిన భారీ ర్యాలీలో వర్చువల్‌గా ప్రసంగించిన టెక్ ఆంత్రప్రెన్యూర్ ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరగబడి పోరాడకపోతే మరణం తప్పదని ర్యాలీకి వచ్చిన వారిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యునైట్ ది కింగ్‌డమ్ పేరిట ఈ ర్యాలీ జరిగింది. ఉత్తర అమెరికా, ఐరోపాకు చెందిన పలువురు వలసల వ్యతిరేకవాదులు ఈ ర్యాలీలో పాల్గొని నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు. బ్రిటన్‌కు చెందిన కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఏకంగా 1.5 లక్షల మంది పాల్గొన్నారుఈ సందర్భంగా ఎలాన్ మస్క్ మాట్లాడుతూ.. 'మీరు చాలా మౌలికమైన సమస్యను ఎదుర్కొంటున్నారు. వామపక్షాలు అంటేనే హత్యల పార్టీలు. వాళ్లు ఓ మరణాన్ని వేడుకలా చూస్తున్నారు. మీరు హింసకు వ్యతిరేకమైనా హింసాత్మక ఘటనల బారినపడక తప్పదు. మీరు తిరగబడకపోతే ప్రాణాలు పోగొట్టుకుంటారు' అని మస్క్ హెచ్చరించారు. మస్క్‌తోపాటు ఫ్రాన్స్‌కు చెందిన ఎరిక్ జెమ్మోర్, జర్మనీ(ఏఎఫ్‌డీ)కి చెందిన వలస విధానాల వ్యతిరేకి పీటర్ బైస్ట్రోన్ కూడా ఈ ర్యాలీలో ప్రసంగించారు. అమెరికాలో చార్లీ కిర్క్ హత్య గురించి ప్రస్తావించారు. ఐరోపాలో తెల్లజాతీయులను ఇతర దేశాల నుంచి వలసొచ్చిన వారు భర్తీ చేస్తున్నారన్న వాదనను ప్రముఖంగా ప్రస్తావించారు.%ఈ పరిణామాలపై అక్కడి విశ్లేషకులు కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలను వ్యతిరేకిస్తూ ఈ స్థాయిలో ర్యాలీలో పాల్గొనడం ఇదే తొలిసారని అన్నారు. వివిధ దేశాలకు చెందిన సంప్రదాయవాదులు అనేక మంది ఈ ర్యాలీలో పాల్గొనడాన్ని ప్రస్తావించారు. యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీకి సమీపంలోనే మరికొందరు జాత్యాహంకారాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలకు తెరతీశారు. ఇది చివరకు ఇరు వర్గాల మధ్య ఘర్షణలకు దారి తీసింది. సుమారు 25 మంది పోలీసులు కూడా గాయపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు సుమారు 26 మంది నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ పరిణామాలను యూకే అంతర్గత వ్యవహారాల మంత్రి షబానా మహమూద్ ఖండించారు. హింసకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కార్పొరేట్ సంస్థలు విదేశీ వర్కర్లను అమెరికాకు తీసుకురావచ్చు: ట్రంప్



అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకే ఇవ్వాలంటూ చెబుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా వెనక్కు తగ్గారు. విదేశీ ఉద్యోగులను కూడా నియమించుకోవచ్చని సోషల్ మీడియాలో కామెంట్ చేశారు. ఇది అమెరికన్లకు ఉపకరిస్తుందని కూడా అన్నారు. అమెరికాలో పెట్టుబడులపై దక్షిణ కొరియా వార్నింగ్‌తో వెనక్కు తగ్గిన ట్రంప్ చేతుల కాలక ముందే రూటు మార్చి దిద్దుబాటు చర్యలకు దిగారు వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అక్రమ వలసదారులను గుర్తించేందుకు రెయిడ్స్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జార్జియా రాష్ట్రంలోని హ్యూందాయ్ ప్లాంట్‌లో సుమారు 475 మంది అక్రమ వలసదారులు హ్యూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారులకు చిక్కారు. ప్లాంట్‌లో దక్షిణ కొరియాకు చెందిన వారు అక్రమంగా పని చేస్తున్నారన్న సమాచారంతో వెళ్లిన అధికారులు అనేక మంది దక్షిణ కొరియన్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో, ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు చెలరేగాయి (%వాశీబ్ష్ర ఖశీతీమ్ఱ అజవర్ఎవత్ ఝతీఅఅస్త్ర). ఈ ఉదంతంపై దక్షిణ కొరియా అధ్యక్షుడు నేరుగా స్పందించారు. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నాయి' అంటూ తేల్చి చెప్పారు. సాంకేతికంగా, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న దక్షిణ కొరియా ఇలా తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేయడంతో ట్రంప్ వెంటనే వెనక్కు తగ్గారు. విదేశీ సంస్థలు ఇతర దేశాల వర్కర్లను అమెరికాకు తెచ్చుకోవచ్చని అన్నారు. 'విదేశీ కంపెనీలు భారీ పెట్టుబడులతో అమెరికాలో పెద్ద ప్లాంట్లు, యంత్రాలు ఏర్పాటు చేస్తున్నప్పుడు ఇతరత్రా కొన్ని అమెరికా బాటపడతాయి. విదేశీ కంపెనీలు ఇలా ఫారిన్ వర్కర్లను కూడా అమెరికాకు తెచ్చుకోవచ్చు. లేకపోతే.. అమెరికాలోని భారీ స్థాయిలో పెట్టుబడులు రావు. చిప్స్, సెమీ కండక్టర్స్, కంప్యూటర్స్, షిప్పులు, రైళ్లు, ఇలా అనేక రంగాల్లో తయారీకి సంబంధించి ఇతరుల నుంచి అమెరికన్లు మెళకువలు నేర్చుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కొంత కాలం పాటు ఫారిన్ సంస్థలు విదేశీ వర్కర్లను అమెరికాలో నియమించుకోవచ్చు' అని ముక్తాయించారు.

## కౌడిపల్లిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం





**కౌడిపల్లి, ప్రజాజ్వాల:**
తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని మండల కేంద్రమైన కౌడిపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సెక్రెటరీ వెంకటేష్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ మురళి , ఎం ఆర్ సి వద్ద ఎంఈఓ బాలరాజ్, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏడిఏ పుణ్యవతి పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద పిఆర్ డిప్యూటీ ఈ ఈ అమరేశ్వర్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ కృష్ణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన ఉపాధ్యాయురాలు లలితాదేవి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మండల వ్యాప్తంగా పాఠశాలల వద్ద ప్రధాన ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మాజీ సర్పంచ్ వేంకటేశ్వర రెడ్డి, పిఏసీఎస్ సొసైటీ వైస్ ఛైర్మన్ చిలుముల చిన్నం రెడ్డి, గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గా గౌడ్ , ముదిరాజ్ సంగం మండల అధ్యక్షుడు మటూరి శాకయ్య , కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌద శ్రీనివాస్ గుప్తా , మాక్బుల్ ,పాషా,వెంకటేశం, మాజీ ఎస్ఎంసి చైర్మన్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ 75వ పుట్టిన రోజు వేడుకలు



**కౌడిపల్లి, ప్రజాజ్వాల:**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ 75వ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌడిపల్లి మండల కేంద్రంలోని బిజెపి ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు, రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారి పాలనలో ప్రపంచ దేశాల్లో మన దేశ కీర్తిని చాటి చెప్పిన ఘనత మోడీకి దక్కిందని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజల కనీస అవసరాలకు ఉపయోగపడేలా జి ఎస్ టి ని తగ్గించిన మోదీకి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, మండల అధ్యక్షులు రాకేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు మోమిన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు విష్ణు, మండల కార్యదర్శులు బూత్ అధ్యక్షులు ఆంజనేయులు, కృష్ణ, దుర్గేందర్, దిశా కమిటీ మెంబెర్స్ రాజు, యువ మోర్చా నాయకులు రవి, శ్రీశైలం సీనియర్ నాయకులు నర్సిములు, శాకయ్య, హరీష్ గౌడ్, శ్రీకాంత్, గణేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు

## చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు

**-జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**




**రాజేంద్రనగర్, ప్రజా జ్వాల :**
చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సముదాయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాలు- ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ సి నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తృణ ధాన్యాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, ముఖ్యంగా శరీరానికి పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మాంసాహారంతో పోలిస్తే చిరు ధాన్యాల్లో ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చిరు ధాన్యాలు రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీఓ సామ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## నర్సాపూర్ నియోజకవర్గంలో ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు

**-చాముండేశ్వరి క్షేత్రంలో మోడీ పేరున కుంకుమార్చన**
**-చిలిప్ చెడు మండల బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు**
**-హత్నూర మండల బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**
**-పాల్గొన్న పలు మండలాల బిజెపి నాయకులు కార్యకర్తలు**



హత్నూర మండల్ దౌల్తాబాద్ గ్రామంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న చిలిప్ చెడ్ మండల బిజెపి అధ్యక్షుడు నాగేష్



చిలిప్ చెడ్ మండల్ చాముండేశ్వరి క్షేత్రంలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మండల బీజేపీ నాయకులు

**నర్సాపూర్, ప్రజాజ్వాల**
భారతీయ జనతా పార్టీ చిలిపిచేడ్ మండల ఆధ్వర్యంలో బుధవారం చిలిప్ చెడ్ మండల బీజేపీ నాయకులు చిట్కుల్ చాముండేశ్వరి టెంపుల్ లో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా నరేంద్ర మోడీ పేరు మీద కుంకుమార్చన చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలతో ఉంటూ మరింత కాలం దేశ ప్రధానిగా కొనసాగాలని, భారత దేశ ఖ్యాతి ప్రపంచానికి చాటిచెప్పేలా నిర్ణయాలు తీసుకోవాలని తెలియజేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హత్నూర మండల్ బిజెపి ఆధ్వర్యంలో దౌల్తాబాద్ కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో చిలక్చర మండల బిజెపి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, చిలిపిచేడ్ మండల్ బిజెపి అధ్యక్షుడు అజ్జమర్రి నగేష్, మండల ప్రధాన కార్యదర్శిలు కొర్పోల్ సత్యనారాయణ, లష్కరి వెంకటేశం, మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణ, మండల్ ఎస్టి మోర్చా అధ్యక్షుడు రమేశ్, స్వామి, బిజెపి మండల మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, మండల సీనియర్ నాయకులు మల్లగల మధు, మల్లేశం, దశరథ్, లక్ష్మణ్, యాదగిరి, ప్రశాంత్, దినేష్, సామి మల్లేశం, వివిధ గ్రామాల బీజేపీ అధ్యక్షులు యాదగిరి, రాజా గౌడ్, మహిపాల్, ప్రశాంత్ నాయక్, రాజు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు





**రాజేంద్రనగర్, ప్రజాజ్వాల:**
రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్ లో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో (టియుఎఫ్ఐడిసి) ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రంగారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూధన్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కాటేదాన్ లో ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు





**రాజేంద్రనగర్, ప్రజాజ్వాల:**
రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాటేదాన్ శాంతినగర్ లోని శ్రీ విరాట్ విశ్వకర్మ దేవాలయంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విశ్వ సృష్టికర్త శ్రీ విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా ఉదయము నుండీ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విశ్వకర్మ పెద్దలు పాల్గొని ధ్వజారోహణ, విశ్వకర్మ పూజ అనంతరం యజ్ఞం హెూమము నిర్వహించారు. ఈ యజ్ఞ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, స్వామి గౌడ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. విశ్వకర్మ మహోత్సవాలు సమాజంలో కలలు చేతివృత్తుల ప్రాముఖ్యతను చాటి చెపుతాయని అన్నారు. సమాజ నిర్మాణంలో విశ్వకర్మ కులస్తుల పాత్ర ఎంతో గొప్పదని వారి కృషి లేనిదే అభివృద్ధి అసాధ్యమని ఆయన కొనియాడారు. విశ్వకర్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాసచారి, ఆలయ ప్రధాన కార్యదర్శి కాసోజు మాధవాచారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు చారి, మహేష్ చారి, సంతోష్ చారి, దిలీప్ చారి, రాష్ట్ర విశ్వకర్మ సంఘం నేతలు పులిగిల్ల రంగాచారి, చెన్నయ్య చారి, సదానంద చారి, దేవాలయ ప్రతినిధులు పులిగిల్ల జ్ఞానేశ్వర్ చారి, పి. రమేష్ చారి,



రవీందర్ చారి, మాధవాచారి, ఎం. నరేందర్ చారి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లడ్డు వేలం పాట...విశ్వకర్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన లడ్డు వేలం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఆలయ ప్రతినిధి పులిగిల్ల రమేష్ చారి 90 వేల రూపాయలతో లడ్డును రెండోసారి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు స్థానికులు రమేష్ చారిని అభినందించారు.

## కలెక్టరేట్ కార్యాలయంలో విరాట్ విశ్వకర్మ వేడుకలు



**రాజేంద్రనగర్, ప్రజాజ్వాల:**
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వృత్తిలో ప్రతి దానికి రూపకల్పన చేసి దానికి ఒక ఆకృతి కల్పించే వారే విశ్వకర్మలని అన్నారు. ఒక రాతిని చెక్కి దేవుని రూపం కల్పించే విశ్వకర్మలు తన వృత్తి నైపుణ్యాన్ని చూపుతారని అలాంటి శిల్పులకు సమాజంలో మంచి ఆదరణ కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను ఈ వృత్తుల వారికి చేయూతనిస్తాయని అన్నారు. భారతదేశ పారిశ్రామిక రంగ ప్రగతికి తార్కాణం విశ్వకర్మ అని కలెక్టర్ కొనియాడారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం శ్రీ విరాట్ విశ్వకర్మ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. అర్హులైన అన్ని కుల వృత్తులు, చేతివృత్తుల వారు ప్రభుత్వపరంగా వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి , డీ ఆర్ఓ సంగీత, డీసీపీ సునీత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు భరోసా సిఎంఆర్ఎఫ్

-పేదల ఆరోగ్యం కోసం ప్రజాప్రభుత్వంలో వేల కోట్లు ఖర్చు

-నీలం మధు ముదిరాజ్..

-రూ.3.25 లక్షల విలువగల చెక్కులు పంపిణీ





**పటాన్ చెరు,ప్రజాజ్వాల:**
పేదోడికి సీఎం సహాయనిధి ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఇస్నాపూర్ మున్సిపాలిటీ-తిప్పగుడిసే సుజాత (60,000), కరణం మంజుల (60,000/-),తిప్పగుడిసే నవీన్(30,000), చిట్కుల్ పరిధిలోని మన్నే వెంకటేష్ (60,000), బొల్లారం మున్సిపాలిటీ - రెడ్డి లక్ష్మణ్ రావు (60,000), గుమ్మడిదల మున్సిపాలిటీ - తుడుం రాజమ్మ (?55,000/-) మొత్తం ?3,25,000/- విలువగల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది అని ఈ పథకం కోసం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మరియు వారి కుటుంబీకులు, ఇస్నాపూర్ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, బొల్లారం మాజీ కౌన్సిలర్ సుజాతమహేందర్ రెడ్డి, దానయ్య, ముత్తంగి అశోక్, తుడుం శ్రీనివాస్, గారెల మల్లేష్, మన్నె రఘు, భిక్షపతి రెడ్డి, గోపాల్, గారెల శ్రీనివాస్, దశరథ్, అనిల్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జండాకు అవమానం??

-జగ్గంపేట గ్రామ పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం?

-రాత్రి 7:40అయినా ఎగురవేసిన జండాను తీయని పాలకులు




**నర్సాపూర్, ప్రజాజ్వాల:**
మెదక్ జిల్లా చిలిప్ చెడ్ మండలం జగ్గంపేట గ్రామంలో ప్రజా పాలన దినోత్సవం నాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎగరవేసిన జాతీయ జెండాను రాత్రి 7:40 అయినప్పటికి తీసివేయకుండా పంచాయతీ పాలకవర్గం జాతీయ జెండాను అవమానించారని స్థానికులు తెలిపారు. జాతీయ జెండా పైనే నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ పాలక వర్గం తీరు పై గ్రామ యువకులు అసహనం వ్యక్తం చేశారు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శ్రేయాస్ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

-పెద్దచెరువులో శ్రేయాస్ అక్రమ విల్లాలపై చర్యలు తీసుకోవాలి

-ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్ డిమాండ్






**మేడ్చల్, ప్రజాజ్వాల:**
మేడ్చల్ గ్రామంలో సర్వే నంబర్లు 879, 881 పరిధిలోని పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్/బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటికి హెచ్ఎండిఏ నుంచి మాన్యువల్ అనుమతులు పొందడమే కాకుండా, చెరువులోనే నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారని ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్ లు ఆరోపించారు. బుధవారం మేడ్చల్ మున్సిపల్ మేనేజర్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసిన సందర్భంగా ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్ లు మాట్లాడుతూ.. శ్రేయాస్ లైఫ్ స్పేసెస్ కన్స్ట్రక్షన్ కంపెనీ, మేడ్చల్ గ్రామంలో పెద్ద చెరువుకు ఆనుకొని సర్వే నంబర్లు 879, 881లో 24.31 ఎకరాల్లో విల్లాల నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. చెరువు ఎఫ్‌టిఎల్/బఫర్ జోన్‌లో నిర్మాణాలకు మాన్యువల్ అనుమతులు హెచ్ఎండిఏ ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారులు కూడా చెరువు పరిధిలో విల్లాల నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వడానికి కారణం, బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు దాదాపు రూ.100 కోట్ల పైచిలుకు పెట్టుబడులు పెట్టడమేనని ఆరోపించారు. ఇప్పటికే చెరువులో 30 వరకు విల్లాలు అక్రమంగా నిర్మించబడుతున్నా, ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఎమ్మెల్యేల సహకారమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే బిఆర్ఎస్ 2ఎమ్మెల్యేల అక్రమ పెట్టుబడులపై దర్యాప్తు జరిపి, మేడ్చల్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్/బఫర్ జోన్‌లో మాన్యువల్ అనుమతులు ఇచ్చిన వ్యవహారంపై రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండిఏ అధికారులపై విజిలెన్స్ విచారణ జరపాలని, అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రేయాస్ లైఫ్ స్పేసెస్ కన్స్ట్రక్షన్ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసి, చెరువును పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, పి బి శ్రీనివాస్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ కాలనీలలో బొంగునూరి కిషోర్ రెడ్డి పాదయాత్ర



**దుండిగల్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ డి పోచంపల్లి ఇందిరా నగర్ కాలనీలలో బుధవారం ఉదయం పాదయాత్రలో భాగంగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి నేరుగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై నేరుగా అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# హత్నూరలో ఘనంగా విశ్వకర్మ జయంతి



**హత్నూర, ప్రజాజ్వాల:**
శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి హత్నూర మండలం దౌల్తాబాద్ లో బుధవారం విశ్వకర్ములు ఘనంగా జయంతి ఉత్సవాల నిర్వహించారు .దౌల్తాబాద్ లో జెండా ఆవిర్భవరణ చేసి పూజ కార్యక్రమం చేయడం నిర్వహించారు .విశ్వకర్మ సంఘం సభ్యులు వడ్లశేఖర్ చారి ,భూషణం చారి, బ్రహ్మ చారి ,భాస్కర్ చారి ,రామ్ చారి ,ప్రవీణ్ చారి ,వీరేశం చారి, వెంకటేశం చారి, శ్రీను చారి ,రఘు చారి, లక్ష్మణ్ చారి, నరసింహా చారి పాల్గొన్నారు.

# నర్సాపూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

-శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి!!



**నర్సాపూర్, ప్రజాజ్వాల:**
నర్సాపూర్ పట్టణంలో బుధవారం మంత్రి వివేక్ వెంకట స్వామి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గం కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక పంపిణీ కార్యక్రమంతో పాటు నర్సాపూర్ పట్టణంలో వైకుంఠధామం ప్రారంభోత్సవం చేశారు. నిరుపేదల సొంతింటి కలలు నెరవేరుస్తున్నది కాంగ్రెస్ పార్టీ అని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో దాదాపుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని నిర్మాణం చేసుకుంటున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుకను కూడా ప్రభుత్వం సరాపర చేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో నర్సాపూర్ నియోజకవర్గాన్ని అన్ని దశల్లో అభివృద్ధి చేస్తామని జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# డ్రైనేజీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
అపురూప కాలనీ మెయిన్ రోడ్ పరిధిలో డ్రైనేజీ పూర్తిగా పాడవటంతో బస్తి వాసులకు తీవ్ర ఇబ్బంది కలుగుతు ఒడడంతో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గత నెల సంప్రదించారు. వెంటనే రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా డ్రైనేజీ కొరకు రూ.13 లక్షల మంజూరు చేయించారు. బుధవారం డివిజన్ అధ్యక్షులు సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి కిరణ్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తిప్పారెడ్డి, సెక్రటరీ రమణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరణ్, చందు, వీరేశ్ గుప్తా, డివిజన్ జనరల్ సెక్రెటరీ నాగిరెడ్డి, కోశాధికారి భాస్కర్ రెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు గణేషన్, సీతారాం రెడ్డి, అంజిరెడ్డి, ఆకుల కృష్ణ, దయాకర్ రెడ్డి, రాజు చారి, సురేందర్ రెడ్డి, ఇన్నయ్య రెడ్డి, ఆదినారాయణ, మోహన్ రావు, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు యాసిన్ గఫార్, మహిళ అధ్యక్షురాలు తులసి, శైలజ, నాగ శిరోమణి, ప్రసన్న,యూత్ నాయకులు శ్యామ్, జానీ, హరి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విరాట్ విశ్వకర్మ భగవంతునికి కెయం ప్రతాప్ ప్రత్యేక పూజలు



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
శ్రీ విరాట్ విశ్వకర్మ భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కెయం ప్రతాప్ వేడుకున్నారు. బుధవారం శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా అయోధ్య నగర్లో గల శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం వారి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కెయం ప్రతాప్ శ్రీ విరాట్ విశ్వకర్మ భగవంతునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం ముఖ్య సలహాదారులు వి బాల్ రాజ్ చారి, కెవి రామాచారి, ఎస్ నారాయణ చారి, సలహాదారులు కే సత్యనారాయణ చారి, కే వీరేశం అధ్యక్షులు కొత్తపల్లి కృష్ణాచారి, ప్రధాన కార్యదర్శి వడ్ల సుభాష్ చారి, కోశాధికారి ఆంజనేయులు చారి, బ్రహ్మయ్య చారి, ఉపాధ్యక్షులు జనార్దన్ చారి, అశోక్ చారి, సంయుక్త కార్యదర్శులు రమేష్ చారి, బాబు చారి, కార్యనిర్వాహకులు ప్రభాకర్ చారి,ఆనంద్ చారి, జగన్నాద్ చారి,ఆంజనేయులు చారి, సత్యనారాయణ చారి, రాజేశ్వర్ చారి, రమేష్ చారి, నరసింహ చారి,రాధాకృష్ణ చారి, అయోధ్య నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మాద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎఎల్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి



**బాలానగర్, ప్రజాజ్వాల:**
హెచ్ఎఎల్ కమ్యూనిటీ హాల్ లో బుధవారం విశ్వకర్మ జయంతి ని పురస్కరించుకొని శ్రీ విరాట్ విశ్వకర్మ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్, ప్రధానకార్యదర్శి మోహన కృష్ణా ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో గుర్తింపు యూనియన్ హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయ్ ప్రసాద్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు,వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, గ్యానేశ్వర్, కుతాడి కృష్ణా, జోగారావు,బాబీ,భారతి, మంజుల నీలవేణి, సుధీర్, రమణ, సూర్యప్రకాష్, నాగరాజు,జాహ్నవి, అనిల్ రెడ్డి, సత్యనారాయణ, సురేష్, నాగార్జున, వెంకటేష్, చారీ, అశోక్, ఆంజనేయులు,మురళి,వేణుల్ గోపాల్ రెడ్డి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హరి వర్ధన్ రెడ్డికి దమ్మని శ్రవణ్ కుమార్ సన్మానం




**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి కార్యాలయంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం చర్చించారు. అనంతరం హరి వర్ధన్ రెడ్డిని మేడ్చల్ మల్కాజిగిరి డి.సి.సి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ సన్మానం చేశారు. కాంగ్రెస్ నాయకులు బి రంగయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.




## ఒక్కో మ్యాచ్ కి రూ. 4.5 కోట్లు.. ఈ లెక్కలు చూస్తే మైండ్ బ్లాంకే భయ్యో..



భారత క్రికెట్ నియంత్రణ మండలి తన కొత్త స్పాన్సర్‌ను ప్రకటించింది. అపోలో టైర్స్ ఇప్పుడు డ్రీమ్-11 స్థానంలోకి వచ్చింది. త్వరలో టీమ్ ఇండియా జెర్సీపై అపోలో టైర్స్ స్టాంప్ కనిపిస్తుంది. ఈ ఒప్పందం అద్భుతంగా ఉంది. డ్రీమ్-11 కంటే అపోలో టైర్స్ %దీజజ×%కి ఎక్కువ డబ్బు ఇస్తుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన కొత్త స్పాన్సర్‌ను ప్రకటించింది. ఇప్పుడు అపోలో టైర్స్ డ్రీమ్-11 స్థానంలోకి వచ్చింది. త్వరలో టీమ్ ఇండియా జెర్సీపై అపోలో టైర్స్ స్టాంప్ కనిపిస్తుంది. ఈ ఒప్పందం బీసీసీఐ ఖజానాపై కాసుల వర్షం కురిపించనుంది. అపోలో టైర్స్ డ్రీమ్-11 కంటే బీసీసీఐకి అధికంగా డబ్బు ఇస్తుంది. బీసీసీఐ ప్రకారం, ఈ ఒప్పందం మార్చి 2028 వరకు అంటే 2.5 సంవత్సరాల పాటు కొనసాగుతుంది.డ్రీమ్-11 తో ఒప్పందం రద్దు..2025 ఆసియా కప్ నకు కొన్ని రోజుల ముందు బీసీసీఐ డ్రీమ్ 11 తో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఆ తర్వాత కొన్ని రోజులకు బీసీసీఐ కొత్త టెండర్ కు తలుపులు తెరిచింది. అందరి మదిలో ఉన్న ప్రశ్న ఏమిటంటే అపోలో టైర్స్ బీసీసీఐకి ఎంత డబ్బు చెల్లిస్తుంది. నివేదిక ప్రకారం, డ్రీమ్-11 మూడు సంవత్సరాల కాంట్రాక్టు కోసం బీసీసీఐకి రూ. 358 కోట్లు విలువైనది. ఇప్పుడు అపోలో టైర్స్ బీసీసీఐకి దాని కంటే ఎక్కువ చెల్లిస్తుంది.అపోలో టైర్స్ ప్రతి మ్యాచ్ కు బీసీసీఐకి రూ.4.5 కోట్లు చెల్లిస్తుంది. డ్రీమ్11 మునుపటి ఒప్పందం ప్రకారం బీసీసీఐకి ఒక్కో మ్యాచ్ కు రూ.50 లక్షల లాభం వస్తుంది. డ్రీమ్11 ఒక మ్యాచ్ కు బీసీసీఐకి రూ.4 కోట్లు చెల్లిస్తోంది. బీసీసీఐ టెండర్ లో కొత్త నియమాలను అమలు చేసింది. జెర్సీ స్పాన్సర్ కోసం, బోర్డు గేమింగ్, బెట్టింగ్, క్రిప్టో, పొగాకు కంపెనీలను పక్కన పెట్టింది.

## 'ఈ ట్రోఫీ మాకొద్దు'.. ఏసీసీకి సూర్యకుమార్ మాస్ వార్నింగ్.. ఎందుకంటే?



"హ్యాండ్ షేక్" వివాదం తర్వాత, ఆసియా కప్‌లో కొత్త ట్విస్ట్ వెలువడింది. భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆసియా క్రికెట్ కౌన్సిల్, పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీని ట్రోఫీ ప్రజెంటేషన్ నుంచి తొలగించాలని కోరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ అలాగే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌మధ్య కొనసాగుతున్న వివాదం ఆసియా కప్‌ను తీవ్ర ఉద్రిక్తత స్థితిలోకి నెట్టివేసింది. టోర్నమెంట్ భవిష్యత్తుపై అనేక అంశాలు చర్చనీయాంశమయ్యాయి. ఆదివారం భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య "హ్యాండ్ షేక్" సంఘటనగా ప్రారంభమైన త్వరగా పూర్తి స్థాయి దౌత్య, రాజకీయ సంక్షోభంగా మారింది. దీంతో పాకిస్తాన్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతామంటూ బెదిరింపులకు దిగింది. ఈ క్రమంలో పీసీబీ కొన్ని షరతులను ఐసీసీ నెరవేర్చినప్పటికీ మీడియా వర్గాల ప్రకారం కొన్ని కొత్త సందేహాలు పుట్టుకొచ్చాయని తెలుస్తోంది.టోర్నమెంట్ లో కొన్ని అంశాలపై భారత్, పాకిస్తాన్ రెండూ ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు కొన్ని అభ్యర్థనలు చేశాయని విశ్వసనీయంగా తెలిసింది. ఆండీ పైక్రాఫ్ట్ తొలగింపునకు సంబంధించిన పీసీబీ అభ్యర్థన విషయానికొస్తే, పాకిస్తాన్ వర్సెస్ యూఏఈ మ్యాచ్‌కు రిచీ రిచర్డ్‌సన్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించడానికి ఐసీసీ అంగీకరించింది. అయితే, తరువాతి దశల్లో పాకిస్తాన్ మ్యాచ్‌లలో పైక్రాఫ్ట్ అంపైరింగ్ చేయడంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.అందువల్ల ప్రస్తుత పరిస్థితి ఇంకా పరిష్కారం కాలేదు. టోర్నమెంట్‌లో పాకిస్తాన్ భాగస్వామ్యం కొనసాగుతుందని నిర్ధారించే ప్రకటనను మొహ్సిన్ నఖ్వీ చేస్తారని భావిస్తున్నారు. అయితే అతను దాని ఆందోళనలను పునరుద్ఘాటించాలని కూడా నిర్ణయించుకోవచ్చు.
మైదానంలో అకస్మాత్తుగా 'కరచాలనం చేయకూడదని' తీసుకున్న నిర్ణయం నఖ్వీని కలత చెందేలా చేశాయనిసంబంధిత వర్గాలు తెలిపాయి. ఒకవేళ ప్రోటోకాల్ ముందే నిర్ణయిస్తే ఆయన దానికి అంగీకరిస్తారు. అయితే, టోర్నమెంట్ మిగిలిన భాగంపై భయాలు ఉన్న ఏకైక దేశం పాకిస్తాన్ మాత్రమే కాదని తెలుస్తోంది.భారత జట్టు ఫైనల్లో విజయం సాధిస్తే, ఆసియా కప్ ట్రోఫీని ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ అయిన నఖ్వీ చేతుల మీదుగా భారత్ అందజేయడం తనకు ఇష్టం లేదని భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ సందేశం %ూజజ%కి కూడా అందజేసినట్లు తెలుస్తోంది.టోర్నమెంట్ తర్వాత మైదానంలో ఇబ్బంది పడకుండా ఉండటానికి పాకిస్తాన్ కూడా ముందుగానే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుంటుంది.



## "150 kmph%స్పీడ్ సరిపోలే.. ఇంకా వేగంగా బౌలింగ్ చేయండి": కావ్యమారన్ ఖతర్నాక్ ప్లేయర్ సీక్రెట్ ఇదే

సాధారణంగా యువ క్రికెటర్లు నెమ్మదిగా ప్రాక్టీస్ చేసి, ఆ తర్వాత వేగానికి అలవాటుపడతారు. కానీ, రాజ్‌కుమార్ శర్మ తన కుమారుడు అభిషేక్ కోసం ఒక ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరించారు. అతను కేవలం 16 ఏళ్ల వయసులో ఉండగానే, ఆ సమయంలో 135-140 వేగంతో బౌలింగ్ చేసే బౌలర్ల వద్దకు తీసుకెళ్లి ప్రాక్టీస్ చేయించేవారు. భారత క్రికెట్‌లో యువ ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందిన అభిషేక్ శర్మ, చిన్న వయసులోనే స్పీడ్ బౌలింగ్‌ను ఎదుర్కొని అద్భుతంగా రాణించడం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. అతని తండ్రి, కోచ్ రాజ్‌కుమార్ శర్మ, అభిషేక్ కేవలం 16 ఏళ్లు రాకముందే 150 కిలోమీటర్ల వేగంతో వచ్చే బంతులను ఎదుర్కొనేలా ఎలా సిద్ధం చేశారో ఇటీవల వివరించాడు.సాధారణంగా యువ క్రికెటర్లు నెమ్మదిగా ప్రాక్టీస్ చేసి, ఆ తర్వాత వేగానికి అలవాటుపడతారు. కానీ, రాజ్‌కుమార్ శర్మ తన కుమారుడు అభిషేక్ కోసం ఒక ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరించారు. అతను కేవలం 16 ఏళ్ల వయసులో ఉండగానే, ఆ సమయంలో 135-140 %ఎఎజూష్ట్ర% వేగంతో బౌలింగ్ చేసే బౌలర్ల వద్దకు తీసుకెళ్లి ప్రాక్టీస్ చేయించేవారు. అయితే, రాజ్‌కుమార్ ఆ కోచ్‌తో "వాళ్లతో ఇంకా వేగంగా బౌలింగ్ చేయించండి" అని చెప్పేవారు. ఇది వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, దీని వెనుక ఒక బలమైన కారణం ఉంది. భారత జట్టు మాజీ ఓపెనర్, ప్రస్తుతం సెలెక్టర్ అయిన శ్రీకాంత్, 150%ఎఎజూష్ట్ర% వేగంతో బంతులను ఎదుర్కోవడానికి ప్రాక్టీస్ చేయమని ఒకసారి అభిషేక్‌కు సలహా ఇచ్చారట. ఈ సలహానే రాజ్‌కుమార్ శర్మకు ప్రేరణగా నిలిచింది. ఫాస్ట్ బౌలింగ్‌కు అలవాటుపడటం ద్వారా, అంతర్జాతీయ స్థాయిలో వచ్చే బౌలర్లను సులభంగా ఎదుర్కోవచ్చని శ్రీకాంత్ చెప్పారట. అప్పటినుంచి రాజ్‌కుమార్ శర్మ, 135-140 %ఎఎజూష్ట్ర% వేగంతో బౌలింగ్ చేసే బౌలర్లను తీసుకెళ్లి అభిషేక్‌తో ప్రాక్టీస్ చేయించేవారు. "ఆ వేగానికి అలవాటుపడండి, ఆ వేగంతో వచ్చే బంతులను ఎదుర్కోవడం వల్ల మీ టైమింగ్, రిఫ్లెక్స్ మెరుగవుతాయి" అని ఆయన అభిషేక్‌కు సూచించారు. ప్రారంభంలో అభిషేక్ కాస్త ఇబ్బంది పడినప్పటికీ, క్రమంగా ఆ వేగానికి అలవాటుపడ్డాడు. ఇది అతని బ్యాటింగ్ టెక్నిక్‌ను, టైమింగ్‌ను గణనీయంగా మెరుగుపరిచింది.
ప్రస్తుతం, ఐపీఎల్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్న అభిషేక్ శర్మ, తన దూకుడు బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ముఖ్యంగా, అతను ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొనే విధానం, వారి బౌలింగ్‌లో బౌండరీలు సాధించడం చూస్తే, చిన్న వయసులో అతను చేసిన ఆ కఠిన ప్రాక్టీస్ ఎంత ఉపయోగపడిందో అర్థమవుతుంది. ఈ ప్రత్యేక శిక్షణ వల్లనే, అభిషేక్ తన 16 ఏళ్ల వయసు నుంచే ఏ బౌలర్‌నైనా, ఏ వేగాన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు. ఇక తాజాగా ఆసియా కప్ 2025లోనూ తుఫాన్ వేగంతో బౌలర్లపై విరుచుకపడుతున్నాడు. స్కోర్ వేగాన్ని బుల్లెట్ రైలులా తీసుకెళ్లడంతో సహాయపడుతున్నాడు.

## టీమిండియాకు గుడ్‌న్యూస్.. ప్రపంచ కప్‌నకు ముందే ప్రపంచ నంబర్ వన్‌గా లేడీ కోహ్లీ..



తొలి వన్డేలో మంధాన అర్ధ సెంచరీతో ఏడు రేటింగ్ పాయింట్లు సంపాదించింది. దీంతో ఆమె ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కైవర్-బ్రంట్ కంటే నాలుగు పాయింట్లు ముందుకు వచ్చింది. ఆమె రెండవ స్థానానికి పడిపోయింది. మంధానకు 735 రేటింగ్ పాయింట్లు ఉండగా, స్కైవర్-బ్రంట్‌కు 731 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి.భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మరోసారి ప్రపంచ నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఆమె హాఫ్ సెంచరీతో ఆమె సత్తా చాటింది. మంగళవారం విడుదలైన ఐసీసీ వన్డే మహిళల బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో ఆమె తిరిగి నంబర్ వన్ స్థానాన్ని సంపాదించుకుంది. ముల్లన్‌పూర్‌లో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో మంధాన 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. కానీ ఆమె ఇన్నింగ్స్ తన జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమైంది. ఆస్ట్రేలియా సులభంగా లక్ష్యాన్ని సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. సెప్టెంబర్ 30న ప్రారంభమయ్యే మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌నకు ముందు ప్రపంచంలోనే నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచిన మంధాన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.తొలి వన్డేలో మంధాన అర్ధ సెంచరీతో ఏడు రేటింగ్ పాయింట్లు సంపాదించింది. దీంతో ఆమె ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కైవర్-బ్రంట్ కంటే నాలుగు పాయింట్లు ముందుకు వచ్చింది. ఆమె రెండవ స్థానానికి పడిపోయింది. మంధానకు 735 రేటింగ్ పాయింట్లు ఉండగా, స్కైవర్-బ్రంట్‌కు 731 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. మంధాన తొలిసారిగా 2019లో ప్రపంచ నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచింది.ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో 64 పరుగులు చేసిన ఓపెనర్ ప్రతీకా రావల్ నాలుగు స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకోగా, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ హర్లీన్ డియోల్ 54 పరుగులతో 43వ స్థానానికి చేరుకుంది. ఆస్ట్రేలియా తరఫున, ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ బెత్ మూనీ 77 పరుగులతో అజేయంగా నిలిచి మూడు స్థానాలు ఎగబాకి ఐదవ స్థానానికి చేరుకోగా, అన్నాబెల్ సదర్లాండ్ (నాలుగు స్థానాలు ఎగబాకి), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (13 స్థానాలు ఎగబాకి) తమ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచిన మ్యాచ్‌లో అర్ధ సెంచరీలు చేసిన తర్వాత సంయుక్తంగా 25వ స్థానానికి చేరుకున్నారు.
ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ కిమ్ గార్త్, స్పిన్నర్ అలానా కింగ్ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక్కొక్క స్థానం ఎగబాకి నాలుగు, ఐదవ స్థానాలకు చేరుకున్నారు.

## 28 ఏళ్లుగా బద్దలవ్వని రికార్డ్..!



ఈ టోర్నమెంట్ చరిత్రలో ఒకటి కంటే ఎక్కువ రికార్డులు నమోదయ్యాయి. క్రికెట్ అభిమానులు ఎల్లప్పుడూ భారీ విజయాలను గుర్తుంచుకుంటారు. ఒక వ్యక్తి చేసిన మొదటి వన్డే డబుల్ సెంచరీ గురించి ఎవరినైనా అడిగితే, సచిన్ టెండూల్కర్ పేరు నాలుకపైకి వస్తుంది. ఇది కూడా నిజమే, కానీ వన్డే క్రికెట్‌లో టెండూల్కర్ మొదటి డబుల్ సెంచరీ చేయలేదు. మహిళల ప్రపంచ కప్ 2025 సెప్టెంబర్ 30న భారతదేశంలో ప్రారంభం కానుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో టీమిండియా తొలిసారి టైటిల్ గెలవడానికి ప్రయత్నిస్తుంది. ప్రారంభ మ్యాచ్‌లో, గౌహతిలో శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఈ టోర్నమెంట్ చరిత్రలో ఒకటి కంటే ఎక్కువ రికార్డులు నమోదయ్యాయి. క్రికెట్ అభిమానులు ఎల్లప్పుడూ భారీ విజయాలను గుర్తుంచుకుంటారు. ఒక వ్యక్తి చేసిన మొదటి వన్డే డబుల్ సెంచరీ గురించి ఎవరినైనా అడిగితే, సచిన్ టెండూల్కర్ పేరు నాలుకపైకి వస్తుంది. ఇది కూడా నిజమే, కానీ వన్డే క్రికెట్‌లో టెండూల్కర్ మొదటి డబుల్ సెంచరీ చేయలేదు.1997 లో జరిగిన అద్భుతం..బెలిండా క్లార్క్ వన్డే క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ సాధించింది. డిసెంబర్ 16, 1997న ముంబైలోని మండుతున్న వేడిలో, క్లార్క్ మహిళల ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా తరపున డెన్మార్క్‌తో ఆడింది. డెన్మార్క్ కొత్త జట్టు, ఆస్ట్రేలియా బలమైన పోటీదారు. ఎవరూ ఊహించని విధంగా మ్యాచ్ జరిగింది. క్లార్క్ తన ఫుట్‌వర్క్‌లో ఖచ్చితమైనది. ఆమె స్ట్రోక్‌ప్లేలో సహనం, ఆధిపత్యం కలగలిసి బ్యాటింగ్ చేసింది. ఆమె అభిమానుల హృదయాలను గెలుచుకున్న డ్రైవ్‌లను కొట్టింది.మహిళల వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక స్కోరు..229 పరుగులతో అజేయంగా తిరిగి రావడం ద్వారా, క్లార్క్ డెన్మార్క్ బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. ఆమె క్రికెట్‌కు వన్డేల్లో తొలి డబుల్ సెంచరీని అందించింది. ఆ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఆమె తన 155 బంతుల ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు కొట్టింది. ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 3 వికెట్లకు 412 పరుగులు చేసింది. డెన్మార్క్ జట్టు కేవలం 49 పరుగులకే ఆలౌట్ అయింది.మహిళల వన్డే ప్రపంచ కప్‌లో డబుల్ సెంచరీ చేసిన ఏకైక క్రీడాకారిణి క్లార్క్. శ్రీలంకకు చెందిన చమరి ఆటపట్టు 2017లో క్లార్క్ రికార్డును చేరువలో నిలిచింది. 2017లో బ్రిస్టల్‌లో ఆస్ట్రేలియాపై ఆమె 178 పరుగులతో అజేయంగా నిలిచింది. క్లార్క్ రికార్డుకు ఆమె 51 పరుగులు దూరంలో నిలిచింది.



## 3 స్థానాలు.. 5 జట్లు..!

సూపర్ ఫోర్‌కు చేరిన మొదటి జట్టుగా టీమిండియా నిలిచింది. టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన మొదటి జట్టు ఓమన్. ఇప్పుడు సూపర్ ఫోర్‌కు చేరుకోవడానికి పాకిస్తాన్, యూఏఈ మధ్య మ్యాచ్ కీలకం అవుతుంది. అదే సమయంలో, గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా ఉండనుంది.2025 ఆసియా కప్‌లో ప్రతిరోజూ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మంగళవారం, బంగ్లాదేశ్ గ్రూప్ బిలో ఎలిమినేట్ కాకుండా ఆఫ్ఘనిస్తాన్ ను ఓడించింది. ఇది ఆసియా కప్‌లో సూపర్ 4 రేసులో వారిని సజీవంగా ఉంచుతుంది. ఇటువంటి పరిస్థితిలో, ఇప్పటివరకు టీం ఇండియా మాత్రమే ఆసియా కప్ సూపర్ 4 దశకు అర్హత సాధించింది. మిగిలిన జట్ల నిర్ణయం ఇంకా కాలేదు.గ్రూప్ బి నుంచి సూపర్ 4 దశకు ఎవరు చేరుకుంటారు?బంగ్లాదేశ్ విజయం తర్వాత, గ్రూప్ బీ నుంచి ఏ జట్టు సూపర్ 4 కి చేరుకుంటుందో ఇంకా నిర్ణయించలేదు. శ్రీలంక తన రెండు మ్యాచ్‌లలో గెలిచి నాలుగు పాయింట్లను కలిగి ఉంది. శ్రీలంక ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడుతుంది. బంగ్లాదేశ్ తన మూడు మ్యాచ్‌ల్లోనూ ఆడింది. 2 విజయాలతో 4 పాయింట్లను కలిగి ఉంది. ఇప్పుడు శ్రీలంక ఆఫ్ఘనిస్తాన్‌ను ఓడించినట్లయితే, అది సూపర్ ఫోర్‌లో తన, బంగ్లాదేశ్ స్థానాన్ని ఖాయం చేసుకుంటుంది. దీనికి విరుద్ధంగా, శ్రీలంక ఓడిపోతే, మూడు జట్లకు చెరో నాలుగు పాయింట్లు ఉంటాయి. అగ్ర రెండు జట్లు నెట్ రన్-రేట్ ఆధారంగా నిర్ణయించబడతాయి.టీం ఇండియా సూపర్ 4 కి అర్హత సాధించిందా?గ్రూప్ ఏ గురించి మాట్లాడితే, సూపర్ ఫోర్‌కు చేరుకున్న మొదటి జట్టుగా భారత్ నిలిచింది. టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన మొదటి జట్టు ఓమన్. ఇప్పుడు సూపర్ ఫోర్‌కు చేరుకోవడానికి పాకిస్తాన్, యూఏఈ మధ్య మ్యాచ్ కీలకం అవుతుంది. అదే సమయంలో, గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా ఉండనుంది.ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో భారత్ నాలుగు పాయింట్లతో సూపర్ ఫోర్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఓమన్‌ను ఓడించి యూఏఈ తన ఆశలను సజీవంగా ఉంచుకుంది. యూఏఈ ఇప్పుడు పాకిస్తాన్‌తో రెండు పాయింట్లతో సమానంగా ఉంది. ఓమన్ తన రెండు మ్యాచ్‌లలోనూ ఓటమిని ఎదుర్కొంది.పాకిస్తాన్ నెట్ రన్ రేట్ బాగుంది. కానీ, ఇప్పుడు దాని వల్ల ఉపయోగం లేదు. దుబాయ్‌లో యూఏఈతో జరిగే మ్యాచ్ పాకిస్తాన్‌కు చాలా ముఖ్యం. ఇది ఆ జట్టుకు డూ ఆర్ డై మ్యాచ్. ఈ మ్యాచ్‌లో ఓడితే, సూపర్ 4కి అర్హత సాధించలేరు. ఆసియా కప్ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. టోర్నమెంట్‌లో నిలవాలంటే పాకిస్తాన్ ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలి.

# స్టెప్- అప్ హోమ్‌లోన్ గురించి తెలుసా? ఎవరికి ప్రయోజనకరం?



సొంతింటి కల నెరవేర్చుకోవడం అంత సులువు కాదు. చాలా మంది సొంతిల్లు కొందామని ప్రయత్నించి.. ఈఎంఐ భారం గురించి ఆలోచించి తమ నిర్ణయాన్ని ఎప్పటికప్పుడు వాయిదా వేస్తుంటారు. ఈలోగా ఇళ్ల ధరలు పెరిగిపోతుంటాయి. దీంతో సొంతింటి కల కలగానే మిగిలిపోతుంటుంది. ముఖ్యంగా కెరీర్ ఆరంభంలో ఉండేవారికి ఇలాంటి అనుభవం ఎదురవుతూ ఉంటుంది. భవిష్యత్‌లో వేతనం పెరుగుతుందన్న నమ్మకం ఉన్నా.. అప్పటి వరకు వేచి చూస్తే ఇళ్ల ధరలు అంతకుమించి పెరిగిపోతుంటాయి. అలాంటి వారి కోసమే ఉన్న రుణ సదుపాయం.. స్టెప్-అప్ హోమ్‌లోన్ సాధారణంగా ఓ 25 ఏళ్లకు గృహ రుణం తీసుకుంటే.. మొత్తాన్ని బట్టి నెల నెలా ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. తొలినాళ్లలో ఈఎంఐలో వడ్డీ భాగం అధికంగా, అసలు భాగం తక్కువగా ఉంటుంది. ఏళ్లు గడిచేకొద్దీ చెల్లించే మొత్తంలో ప్రిన్సిపల్ అమౌంట్ పెరుగుతుంటుంది. ఈఎంఐలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. స్టెప్- అప్ హోమ్‌లోన్ విషయంలో ఆరంభంలో ఈఎంఐ మొత్తం తక్కువగా ఉంటుంది. కాలక్రమేణా ఆ మొత్తం పెరుగుతుంటుంది. ఎవరికైనా కెరీర్ ప్రారంభంలో వేతనాలు తక్కువగా ఉంటాయి. తర్వాత పెరుగుతుంటాయి. అలాంటి వారికి ఈ తరహా రుణ విధానం ప్రయోజనకంగా ఉంటుంది. వివిధ బ్యాంకులు ఈ తరహా రుణాలను అందిస్తున్నాయి. స్టెప్ హోమ్‌లోన్ విధానంలో ఈఎంఐ తక్కువగా ఉండడం వల్ల ఎక్కువ రుణ మొత్తంలో పొందేందుకూ వీలుంటుంది. తక్కువ వయసులోనే గృహ రుణాన్ని పొందొచ్చు. దీర్ఘకాలం పాటు చెల్లించే వెసులుబాటు లభిస్తుంది. కెరీర్ ఆరంభంలోనే ఆదాయపు పన్ను ప్రయోజనాలు పొందొచ్చు. అదే సమయంలో సాధారణ గృహ రుణంతో పోలిస్తే స్టెప్-హోమ్ లోన్ విషయంలో ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి రావొచ్చు. మీ వేతనంలో ఊహించినంత పెరుగుదల లేకపోతే భవిష్యత్‌లో ఈఎంఐ చెల్లించడంలో భారం కావొచ్చు. ఈ తరహా హోమ్‌లోన్ విధానంలో కాలక్రమేణ ఈఎంఐ మొత్తం తగ్గుతుంటుంది. కెరీర్‌లో మంచి పొజిషన్‌లో ఉండి ఎక్కువ మొత్తంలో ఆర్జిస్తూ.. భవిష్యత్‌లో ఈఎంఐ భారం తగ్గించుకోవాలనుకునే వారికి ఈ తరహా హోమ్‌లోన్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు ఎవరైతే రిటర్మెంట్‌కు మరికొన్నేళ్ల దూరంలో ఉంటారో వారు ఈ ఆప్షన్‌ను పరిశీలించొచ్చు. ఆరంభంలో ఎక్కువ మొత్తంలో ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుందనేది గుర్తుంచుకోవాలి. చివరిగా: గృహ రుణం తీసుకునేటప్పుడు వయసును బట్టి స్టెప్- అప్ లేదా స్టెప్ - డౌన్ రుణాలను పరిశీలించొచ్చు. సాధారణ రుణంతో పోలిస్తే ఎంతవరకు ప్రయోజనం అనేది బేరీజు వేసుకున్నాకే తుది నిర్ణయం తీసుకోవాలి.




# వంటగ్యాస్ ఈకేవైసీకి తుది గడువుపై.. కేంద్ర మంత్రి క్లారిటీ



దిల్లీ: గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ నమోదు ప్రక్రియ చేపట్టాలంటూ కొన్ని నెలల కిందట కేంద్రప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీలను ఆదేశించింది. దీంతో ఎల్‌పీజీ కంపెనీలు ఈ ప్రక్రియను ప్రారంభించాయి. అయితే, గ్యాస్ ఏజెన్సీల వద్ద మాత్రమే ఈకేవైసీని నమోదు చేయాలని కొన్ని కంపెనీలు పట్టుబడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తాజాగా కేరళ శాసనసభ ప్రతిపక్ష నేత వీడీ సతీశన్.. కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీ కి లేఖ రాశారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి.. ఈకేవైసీ ప్రక్రియపై క్లారిటీ ఇచ్చారు. అంతేగాక.. దీని నమోదుకు ఎలాంటి తుది గడువు విధించలేదని స్పష్టం చేశారు. "బోగస్ కస్టమర్లను తొలగించేందుకే చమురు మార్కెటింగ్ సంస్థలు ఈకేవైసీ ఆధార్ అథెంటికేషన్ పక్రియను చేపడుతున్నాయి. గత 8 నెలలుగా ఇది కొనసాగుతోంది. ఎల్‌పీజీ డెలివరీ సిబ్బంది గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేసే సమయంలోనే కస్టమర్స్ వివరాలను వెరిఫై చేస్తారు. వారి మొబైల్ ఫోన్లలోని యాప్‌తో వినియోగదారుల ఆధార్ వివరాలను నమోదు చేసుకొని ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు. లేదా కస్టమర్లు తమ సౌలభ్యం మేరకు దగ్గర్లోని డిస్ట్రిబ్యూటర్ షోరూమ్‌కు వెళ్లి కూడా దీన్ని పూర్తి చేయొచ్చు. దీంతో పాటు చమురు మార్కెటింగ్ సంస్థల యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని సొంతంగా కేవైసీ అప్‌డేట్ చేసుకోవచ్చు" అని కేంద్రమంత్రి వివరించారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చమురు సంస్థలు గానీ.. కేంద్ర ప్రభుత్వం గానీ ఎలాంటి తుది గడువు విధించలేదని హర్‌దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. ఎల్‌పీజీ ఏజెన్సీల్లోనే కచ్చితంగా ఈకేవైసీ నమోదు చేయాలనే నిబంధనేదీ లేదని వెల్లడించారు. వినియోగదారులకు కంపెనీలు ఎలాంటి అసౌకర్యం కలిగించబోవని తెలిపారు.

# 80,100 ఎగువకు సెన్సెక్స్.. 24,350 పైన నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 183 పాయింట్ల లాభంతో 80,143 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 39 పాయింట్లు పెరిగి 24,360 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.50 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో మారుతీ, ఎం అండ్ ఎం, టైటన్, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. రిలయన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, యాక్సిస్ బ్యాంక్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. అక్కడినుంచి సంకేతాలు అందుకున్న ఆసియా మార్కెట్లు నేడు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 85.65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.61 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.2,867 కోట్ల వాటాలను కొన్నారు.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## పవర్‌ఫుల్ బెనిఫిట్స్ ఉన్న పాషన్ ఫ్రూట్..

### ఎక్కడ కనిపించినా వదలకుండా తినేయండి..!

ఈ పండు లోపలి భాగం జ్యూసీగా మెత్తగా ఉంటుంది. ఇది శక్తివంతమైన ఫైబర్‌తో నిండి ఉంటుంది. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ కృష్ణ పలం తీసుకోవడం వల్ల మదుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. అంతేకాదు.. పాషన్ ఫ్రూట్ ఆకులు కూడా పండ్ల లాగే పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. పాషన్ ఫ్రూట్..దీనిని కృష్ణ పండు అని కూడా పిలుస్తారు. ఇది తీగజాతి మొక్క. దీని ఆకులు, పండ్ల అద్భుత లక్షణాల గురించి తెలిస్తే%ొా%ఎక్కడ కనిపించినా కూడా వదలకుండా తెచ్చుకుని తినేస్తారు.. ఈ పండు లోపలి భాగం జ్యూసీగా మెత్తగా ఉంటుంది. ఇది శక్తివంతమైన ఫైబర్‌తో నిండి ఉంటుంది. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ కృష్ణ పలం తీసుకోవడం వల్ల మదుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. అంతేకాదు.. పాషన్ ఫ్రూట్ ఆకులు కూడా పండ్ల లాగే పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. పాషన్ ఫ్రూట్ ఆకులో విటమిన్ సి, ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి ప్రయోజనకరంగా ఉంటాయని రుజువు చేస్తాయి. ఆకులను కూరగాయలుగా తినవచ్చు. ఇది శరీరానికి అవసరమైన విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. పాషన్ ఫ్రూట్ ఆకులు ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ ఆకుల రసం లేదా కషాయాలను తీసుకోవడం ద్వారా, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించవచ్చు. ఇది దీర్ఘకాలంలో మధుమేహం ప్రభావాలను తగ్గిస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచి గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతుంది. కృష్ణ ఫలంలో విటమిన్ ఏ బీటా కెరోటిన్ రూపంలో ఉంటుంది. అంధత్వాన్ని తగ్గిస్తుంది. కంటి పనితీరును మెరుగుపరుస్తుంది. బరువు పెరగడం వల్ల కలిగే జీవక్రియ రుగ్మతలను తొలగిస్తుంది. కృష్ణ ఫలంలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. తరచూ కృష్ణ ఫలం తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్, క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుతుంది. పాషన్ ఫ్రూట్ ఆకులను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని అన్నారు.



## రోజూ పెరుగు తింటున్నారా.. అయితే, ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..!



పెరుగు...దాదాపు అందరూ ఇష్టంగా తింటూ ఉంటారు. ఇక వేసవిలో అయితే, పెరుగు డిమాండ్ ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం చాలా మంది పెరుగు, మజ్జిగను తీసుకుంటారు. అయితే, ఇలా ఏదో ఒక రూపంలో రోజూ పెరుగు తీసుకుంటే శరీరంలో ఎలాంటి మార్పులు కలుగుతాయో పోషకాహార నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ తెలుసుకుందాం...పెరుగు తినడం వల్ల పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెరుగులో ప్రోటీన్స్, కాల్షియం, విటమిన్లు, మినరల్స్ ఇలా శరీరానికి అవసరమైన పోషకాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఎముకలకి చాలా మంచిది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. ఇది అసిడిటీ, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. రోజూ పెరుగు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పెరుగులోని కాల్షియం, విటమిన్లు, కేలరీలు, ప్రోటీన్ శరీరానికి సరైన పోషణను అందిస్తాయి. పెరుగు కాల్షియం, విటమిన్లు %దీ2, దీ%12, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది. పెరుగును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. పెరుగులో కొవ్వు తక్కువగా ఉంటుంది. గుడ్ కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇందులోని కొవ్వు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రోజూ పెరుగు తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. పెరుగులోని ప్రోటీన్స్ అతిగా తినడాన్ని తగ్గిస్తుంది. కాబట్టి బరువు కూడా తగ్గుతారు. ఇక ఇందులోని కాల్షియం తలనొప్పి తగ్గిస్తాయి. అంతేకాదు..పెరుగు తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పెరుగు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పెరుగు చుండ్రుతో సహా అనేక జుట్టు సమస్యలను తగ్గిస్తుంది.

## టమాటాలతో జాగ్రత్త! అతిగా తింటే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు..



టమాటా.. కూరలన్నింటికీ రాజు. దాదాపు ప్రతి భారతీయ వంటకంలో దీనిని ఉపయోగిస్తారు. ఇది ఆహారానికి రుచిని, రంగును ఇస్తుంది. అయితే, టమాటాలో మంచి గుణాలే కాకుండా, కొన్ని హానికరమైన గుణాలు కూడా ఉన్నాయని మీకు తెలుసా? ఒక పాత సామెత చెప్పినట్లు, అతిగా తింటే అమృతం కూడా విషం అవుతుంది. అలాగే రుచిగా ఉన్నాయని టమాటాలను కూరలు పచ్చళ్ల రూపంలో ఎక్కువగా తీసుకుంటే ఈ అనర్థాలు తప్పవట. టమాటాలు మన వంటగదిలో రోజువారీ ఉపయోగించే ఒక ముఖ్యమైన వస్తువు. కొన్ని వంటకాలకు రుచిని పెంచుతాయి. టమాటాలో అనేక పోషకాలు, విటమిన్లు, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. టమాటాలో ఉండే విటమిన్ సి, లైకోపీన్, ఫైబర్ రక్తహీనత, ఆస్తమా, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే, ఏ పదార్థం అయినా అతిగా తింటే శరీరానికి హాని చేస్తుంది. టమాటాలు ఎక్కువగా తింటే కలిగే 4 ప్రధాన సమస్యలు ఇవి:అసిడిటీ: టమాటాలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకుంటే అసిడిటీ సమస్యలు వస్తాయి. గ్యాస్ సమస్య: మీకు కడుపులో గ్యాస్ సమస్య ఉంటే, టమాటాలను ఎక్కువగా తినకూడదు. ఈ సమస్య తగ్గించుకోవాలంటే తక్కువ పరిమాణంలో టమాటాలు తినాలి. కిడ్నీలో రాళ్ళు: కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు టమాటాలను తినకూడదు. టమాటా గింజలు పిత్తాశయంలో రాళ్లకు కారణం అవుతాయి. అందుకే టమాటాలు తినేటప్పుడు గింజలు తీసేసి తినడం మంచిది. గుండెలో మంట: టమాటాలు ఎక్కువగా తినడం వల్ల గ్యాస్ సమస్యలు పెరిగి గుండెలో మంట వస్తుంది. అంతేకాకుండా, టమాటాలు అధికంగా తీసుకుంటే గొంతు, నోరు మండడం, తలతిరగడం లాంటి సమస్యలు కూడా రావచ్చు. టమాటాలో ఫ్రక్టోజ్ అధికంగా ఉంటుంది. అది కొందరిలో హిస్టామిన్ ప్రతిచర్యలకు కారణం అవుతుంది. టమాటాలో సోలనిన్ అనే ఆల్కలాయిడ్ ఉంటుంది. అది కీళ్లనొప్పులు, వాపులకు దారితీస్తుంది. గమనిక: ఈ కథనంలో పేర్కొన్న ఆరోగ్య సమాచారం సాధారణ అవగాహన కోసం మాత్రమే. టమాటాలు తినడం వల్ల మీకు ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని భావిస్తే, వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది. సొంతంగా వైద్యం చేసుకోవడం తగదు.

# ఆ టాలీవుడ్ యంగ్ హీరోకి రష్మిక సోదరి..!

కన్నడ బ్యూటీ రష్మిక మందన్న టాలీవుడ్ లో ఛలో సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. కన్నడ బ్యూటీ రష్మిక మందన్న టాలీవుడ్ లో ఛలో సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. ఆ తర్వాత గీత గోవిందం సినిమా లో నటించే ఛాన్స్ దక్కించుకుంది. ఛలో మరియు గీత గోవిందం బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకోవడంతో టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారి, ఆ తర్వాత నేషనల్ క్రష్ గా గుర్తింపు దక్కించుకుంది. టాలీవుడ్ లో రష్మిక కి అత్యంత సన్నిహితులు ఉన్నారు. చాలా మంది హీరోయిన్స్ టాలీవుడ్ లో ఎన్ని సినిమాలు చేసినా కూడా పెద్దగా బాండింగ్ ను పెంచుకోరు. కానీ రష్మిక మందన్న మాత్రం విజయ్ దేవరకొండ ఫ్యామిలీ తో పాటు తన మొదటి సినిమా హీరో నాగ శౌర్య ఫ్యామిలీ తో కూడా మంచి సాన్నిహిత్యం ఉంటున్నట్లుగా సమాచారం.

ఇవే తాజాగా నాగ శౌర్య తల్లి, నిర్మాత అయిన ఉషా ప్రసాద్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రష్మిక మందన్న గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఉషా మాట్లాడుతూ.. ఛలో సినిమా ద్వారా రష్మిక ను పరిచయం చేయడం.. ఇప్పుడు తను నేషనల్ క్రష్ గా స్టార్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకోవడం సంతోషంగా ఉంది. ఛలో సినిమా షూటింగ్ ప్రారంభం సమయంలో రష్మికతో కలిసి ఆమె తల్లిదండ్రులు వచ్చే వారు. కానీ షూటింగ్ ప్రారంభం అయిన కొన్నాళ్లకే రష్మిక మాకు చాలా దగ్గర అయింది. నన్ను మమ్మీ అని పిలిచేంత సాన్నిహిత్యం ఆమెకు ఏర్పడింది. నన్ను మా వారిని మమ్మీ డాడీ అని పిలుస్తూ మాలో ఒక అమ్మాయిగా కలిసి పోయింది. రష్మిక ఉషా ప్రసాద్ దంపతులను రష్మిక మందన్న మమ్మీ డాడీ అని పిలవడం ద్వారా నాగ శౌర్య కి ఆమె సోదరి అన్నట్లే కదా అంటూ ఇప్పుడు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఉషా ప్రసాద్ తాజా ఇంటర్వ్యూలో రష్మిక మందన్న గురించి చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.





# త్వరలోనే ఓటీటీలోకి జూనియర్

కొన్ని సినిమాలకు థియేటర్ రిలీజ్ కంటే ఓటీటీ రిలీజ్ కోసమే ఆడియన్స్ ఎక్కువగా ఎదురుచూస్తుంటారు. ఆడియన్స్ దృష్టిలో థియేటర్లలో మాత్రమే చూసే సినిమాలు కొన్ని, ఓటీటీ లో చూసే సినిమాలు కొన్ని అని సపరేట్ కేటగిరీలుంటాయి. ఆడియన్స్ అలా వెయిట్ చేస్తున్న సినిమాల్లో జూనియర్ కూడా ఒకటి. ఈ మూవీతోనే ప్రముఖ పారిశ్రామిక వేత్త గాలి జనార్ధన్ రెడ్డి కొడుకు గాలి కిరీటి రెడ్డి ఇండస్ట్రీలోకి వచ్చి హీరోగా పరిచయమయ్యాడు. టాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ శ్రీలీల హీరోయిన్ గా నటించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో జెనీలియా కీలక పాత్రలో నటించారు. రిలీజ్ కు ముందు మంచి బజ్ తో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ ను తెచ్చుకున్నప్పటికీ సూపర్‌హిట్ కాలేకపోయింది. దీంతో సినిమా ఎక్కువ రోజులు ఆడలేకపోయింది. ఈ నేపథ్యంలోనే జూనియర్ ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని చూస్తున్నారు ఆడియన్స్. ప్రేక్షకుల ఎదురుచూపులకు తెర దించుతూ జూనియర్ ఓటీటీ రిలీజ్ అప్డేట్ వచ్చేసింది. జ్ఞాపకాలు, ప్రేమ, నమ్మలేని నిజం.. త్వరలోనే అందరికీ తెలుస్తాయి. జూనియర్.. త్వరలోనే ఆహా లోకి వస్తుంది అని ఆహా ఓటీటీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేసింది. అయితే జూనియర్ మూవీని సెప్టెంబర్ 19 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ కు తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది.జూనియర్ రైట్స్ ప్రైమ్ వీడియో వద్ద కూడా?అయితే జూనియర్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వద్ద కూడా ఉన్నాయని, ఇతర భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ రైట్స్ ను ప్రైమ్ వీడియో సొంతం చేసుకుందని అంటున్నారు. కానీ ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన ఈ సినిమాను హిందీ, తమిళ, మలయాళ భాషల్లోనూ డబ్బింగ్ వెర్షన్స్ తో స్ట్రీమింగ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్టు అంటున్నారు కానీ దానిపై ఎలాంటి ఇన్ఫర్మేషన్ లేదు.

# పవన్ ట్వీట్‌కు తారక్ అలా.. ఎందుకీ డిస్కషన్?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్.. ఇటీవల తన పుట్టిన రోజును జరుపుకున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఆయన ఫ్యాన్స్ తారక్ బర్త్ డేను పండగలా జరుపుకున్నారు. కొన్ని చోట్ల అభిమానులు రక్తదానం చేశారు. పెద్ద పెద్ద కటౌట్లు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇక సోషల్ మీడియాలో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్ని లక్షల మంది ఫ్యాన్స్.. ఎన్టీఆర్ కు బర్త్ డే విషెస్ తెలుపుతూ పోస్టులు పెట్టారు. తారక్ నటిస్తున్న సినిమాల మేకర్స్ కూడా స్పెషల్ అప్డేట్స్ ఇచ్చారు. దేవర మూవీ నుంచి ఫియర్ సాంగ్ ను ఒకరోజు ముందుగానే మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రశాంత్ నీల్ తో జూనియర్ ఎన్టీఆర్ చేయాల్సిన సినిమా షూటింగ్ అప్డేట్ ను అనౌన్స్ చేశారు ఆ మూవీ మేకర్స్. తారక్ బాలీవుడ్ డెబ్యూ వార్-2 ప్రాజెక్ట్ నుంచి కూడా స్పెషల్ పోస్టర్ వస్తుందని ఫ్యాన్స్ ఆశించారు. కానీ ఆ సినిమా మేకర్స్ ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. ఇక జూనియర్ ఎన్టీఆర్ కు టాలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన సినీ ప్రముఖులతో పాటు బీటౌన్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా విషెస్ తెలిపారు. అయితే తారక్ కు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. తన జనసేన పార్టీ ట్విట్టర్ అకౌంట్ ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్టీఆర్ కు పవన్ బర్త్ డే విషెస్ చెప్పడంతో పవర్ స్టార్ అభిమానులతో పాటు మ్యూచువల్ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా ఎంతో సంతోషించారు. ఇదంతా బాగానే ఉన్నా.. ఇప్పుడు తారక్ పై కొందరు పవన్ ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. తనకు విషెస్ చెప్పిన సెలబ్రిటీలందరికీ ఎన్టీఆర్ రీసెంట్ గా రిప్లై ఇచ్చారు. కానీ జనసేన పార్టీ అకౌంట్ నుంచి వచ్చిన ట్వీట్ కు మాత్రం స్పందించలేదు. దీంతో పవర్ స్టార్ ఫ్యాన్స్.. కావాలనే తారక్ %జీరో% ట్వీట్ కు రిప్లై ఇవ్వలేదని కామెంట్లు పెడుతున్నారు. ఇది కరెక్ట్ కాదని, అందరికీ రిప్లై ఇచ్చి ఒక్క పోస్ట్ కు ఎందుకు అలా అని ప్రశ్నిస్తున్నారు. అయితే వాటికి తారక్ ఫ్యాన్స్ కూడా స్పందిస్తున్నారు. పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్ మధ్య మంచి బాండింగ్ ఉందనే విషయం అందరికీ తెలుసని అంటున్నారు. పవన్ సోషల్ మీడియా అకౌంట్ నుంచి పోస్ట్ వచ్చి ఉంటే.. పక్కాగా తారక్ రిప్లై ఇచ్చేవారని చెబుతున్నారు. జనసేన హ్యాండిల్ నుంచి పోస్ట్ రావడంతో జస్ట్ మిస్ అయ్యి ఉంటారని అంటున్నారు. ఏదేమైనా జూనియర్ ఎన్టీఆర్.. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. అందుకే పొలిటికల్ పార్టీ నుంచి వచ్చిన ట్వీట్ కు స్పందించకపోయి ఉంటారని మరికొందరు చెబుతున్నారు. అసలు ఈ డిస్కషనే వేస్ట్ అని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు.



# మత్తు కళ్లతో కవ్విస్తున్న అందాల

జ్ఞానేశ్వరి ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని సొంతం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేసి ఇండస్ట్రీలో అడుగు పెట్టింది నీ జతగా సినిమాతో టాలీవుడ్ లో హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ జ్ఞానేశ్వరి కంద్రేగుల. వైజాగ్ కు చెందిన అందాల ముద్దుగుమ్మ మోడలింగ్ లో కొన్నాళ్లు సందడి చేసింది. ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని సొంతం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేసి ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. టాలీవుడ్ లో తెలుగు అమ్మాయిలకు అంతగా అవకాశాలు రావు అనే విషయం జ్ఞానేశ్వరి విషయంలో కూడా నిరూపితం అయ్యింది. హీరోయిన్ గా అయితే కెరీర్ ను ఆరంభించిన ఈ అమ్మడు ఆ తర్వాత దాన్ని కొనసాగించడంలో చాలా కష్టాలు పడుతోంది. మాయలో సినిమా తో గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా తో పెద్దగా ఈ అమ్మడికి గుర్తింపు రాలేదు. గత ఏడాదిలోనే చక్రవ్యూహం సినిమా తో వచ్చింది. ఆ సినిమా కూడా నిరాశ పరిచింది. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడి సందడి కొనసాగుతుంది. ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నెట్టింట ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు స్టార్ హీరోయిన్స్ అందాల ఫోటోలకు పోటీ అన్నట్లుగా ఉంటాయి అనేది కొందరి కామెంట్. తాజాగా మరోసారి తన అందాల ఫోటోలను షేర్ చేసింది. కవ్వించే చూపులతో, మత్తు కళ్లతో నెటిజన్స్ కు మత్తెక్కించే విధంగా ఉన్న చూపుతో ఫోటో షూట్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చింది. ఈ రేంజ్ అందం ఉన్న కూడా పాపం తెలుగు అమ్మాయి అనే ఒకే ఒక్క ట్యాగ్ వల్ల ఎక్కువ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# మౌళికి మరో బంపరాఫర్



సినీ ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ అనేది ఎంట్రీ వరకే పనికొస్తుంది తప్పించి ఆ తర్వాత సొంత టాలెంట్ లేకపోతే వాళ్లని ఆడియన్స్ ఎంకరేజ్ చేయరు. టాలెంట్ ఉంటే కాస్త లేటైనా సరే స్టార్లుగా మారొచ్చని ఇప్పటికే ఎంతోమంది ప్రూవ్ చేశారు. టాలెంట్ ఎవరి సొత్తూ కాదు అని అదేదో పాటలో ఉన్నట్టు మంచి కథ, దాన్ని ఆడియన్స్ వరకు తీసుకెళ్లే టాలెంట్ ఉంటే ఎవరైనా సక్సెస్ అవొచ్చు.ఇదే విషయాన్ని చెప్తున్నారు మంచు మనోజ్. మోహన్ బాబు కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మనోజ్, ఆ తర్వాత తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ కొంత కాలంగా మనోజ్ కెరీర్ ఫామ్ లో లేదు. రీసెంట్ గా మిరాయ్ సినిమాతో మంచి సక్సెస్ ను అందుకున్న మనోజ్, మిరాయ్ సక్సెస్‌మీట్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.సక్సెస్ అవాలంటే స్టార్ల కొడుకులే కానక్కర్లేదుటాలీవుడ్ లో రీసెంట్ గా సక్సెస్ అయిన సినిమాల గురించి మాట్లాడుతూ లిటిల్ హార్ట్స్ సక్సెస్ గురించి ప్రస్తావించారు మనోజ్. ఇండస్ట్రీలో హీరోగా నిలదొక్కుకోవాలంటే చిరంజీవి, మోహన్ బాబు కొడుకులే కానక్కర్లేదని, మంచి టాలెంట్, కష్టపడే తపన ఉండే ఎవరైనా సక్సెస్ అవొచ్చని రీసెంట్ గా లిటిల్ హార్ట్స్ మూవీతో యూట్యూబర్ మౌళి నిరూపించాడని మనోజ్ ప్రశంసించారు.మిరాయ్ కు దక్కిన పెద్ద కాంప్లిమెంట్ అదే!అక్కడితో ఆగకుండా నీ సినిమాలో ఎప్పుడైనా విలన్ పాత్ర ఉంటే నేను తప్పకుండా చేస్తానని మౌళికి మీడియా ముఖంగా బంపరాఫర్ ఇచ్చారు మంచు మనోజ్. మిరాయ్ మూవీ సక్సెస్ విషయంలో ఎమోషనల్ అయిన మనోజ్, సినిమా చూశాక తన తల్లి తనను హగ్ చేసుకుని ఎమోషనల్ అవడంతో పాటూ మహావీర్ లామా క్యారెక్టర్ లో నా బిడ్డ అదరగొట్టాడని చెప్పడమే తనకు దక్కిన పెద్ద కాంప్లిమెంట్ అని చెప్పారు మనోజ్.రాజాసాబ్ రికార్డులు తిరగరాస్తుంది ఈ మధ్య ఆడియన్స్ థియేటర్లకు రావడం లేదనే అపోహ జనాల్లో బాగా ఉండిపోయిందని, కానీ మంచి కంటెంట్ తో వస్తే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తారని చెప్పిన మనోజ్, టి.జి విశ్వప్రసాద్ లాంటి మంచి నిర్మాతను తానెప్పుడూ చూడలేదని, సినిమా కోసం ఆయన ఏమైనా చేస్తారని, ప్రభాస్ హీరోగా రాబోయే రాజా సాబ్ రికార్డులు తిరగరాస్తుందని చెప్పారు. తన నెక్స్ట్ మూవీగా డేవిడ్ రెడ్డి రానుందని, ఆ తర్వాత అబ్రహం లింకన్, రక్షక్ సినిమాలు చేస్తున్నట్టు మనోజ్ వెల్లడించారు.

Prajajwala Telugu Daily : Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI ,[LATE] A.BHASKAR RAO, Head Office: Vizag, T.S.Branch Office Address: plot no: 204, Road No:7 venus Rocks Heights, Devendra Nagar-Gajularamaram Quthbullapur, Hyderabad- 500055: prajajwalatelangana@gmail.com cell. no. 9700070315, RNI No. APTEL 2010/33400.